

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :15 సంచిక: 04 హైదరాబాద్ 2015 ఆగష్టు పేజీలు 40

Please visit : www.srimeherbaba.com వార్షిక సభ్యత్వం : రూ.100/-

# చల్లపల్లి సెంటర్ స్వర్ణోత్సవాలు

చల్లపల్లి బాబా సెంటర్ స్వర్ణోత్సవాలు 2015 ఆగస్టు 29, 30 తేదీలలో ఘనంగా నిర్వహించనున్నామని కార్యదర్శి శ్రీ పి.వి. రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలలో భాగంగా ఏర్పాటు చేసిన వేదికపై ప్రసంగించదల్చిన వక్తలు, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనగోరువారు తమ వివరాలు ఆగస్టు10లోగా పంపవల్సిందిగా ఆయన కోరుతున్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా మెహెరాబాద్ నుంచి చైర్మన్, బాబా ట్రస్టు, శ్రీ శ్రీధర్ కేల్కర్, శ్రీ జాల్ పి. దస్తూర్, శ్రీమతి డాలీ దస్తూర్, తదితరులు పాల్గొంటున్నారు. శ్రీ బి. రామక్రిష్ణయ్య, శ్రీ యస్వీ ప్రసాద రాజు, సహవాస్ కార్యక్రమాలను నిర్వహిస్తారు. బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొనవల్సిందిగా కోరుతున్నారు. మరిన్ని వివరాలకు (99636 58859) సంప్రదించగలరు.

# భీమ్లీ బాబా సెంటర్ రజతోత్సవాలు

విశాఖపట్నంకు సమీపంలోని భీమునిపట్నం (భీమ్లీ) బాబా సెంటర్ రజతోత్సవాలు 2015 అక్టోబరు 10, 11 తేదీలలో రెండ్రోజులు నిర్వహిస్తున్నట్లు స్థానిక సెంటర్ అధ్యక్షురాలు శ్రీమతి రమ ఒక ప్రకటనలో తెలిపారు. బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొని బాబా వారి ఆశీశ్శులు అందుకోవల్సిందిగా శ్రీమతి రమ (93-96-330070) కోరుతున్నారు.

# మల్కాజిగిరి బాబా సెంటర్ నూతన భవనం

మల్కాజిగిరి బాబా సెంటర్ నూతన భవన ప్రాంగణాన్ని బాబా ట్రస్టు సభ్యులు శ్రీ మెహెర్‌నాథ్ కల్చురీ 2015 అక్టోబరు 11న ప్రారంభించనున్నారని, ఈ సందర్భంగా ఒక ప్రత్యేక ప్రేమిక సహవాస్ ఏర్పాటు చేసినట్లు, ప్రేమికులు అధికసంఖ్యలో పాల్గొనాలని కార్యదర్శి శ్రీ హరి (93-46-257902) ఒక ప్రకటనలో తెలిపారు.

# మెహెర్‌స్థాన్ ధర్మశాల నూతన కార్యవర్గం

మెహెర్‌స్థాన్ ధర్మశాల నూతన కార్యవర్గం ఎంపిక 2015 ఆగస్టు 9న జరిగినట్లు బాబా ప్రేమికలు శ్రీ విఆర్‌కె శాస్త్రి ఒక ప్రకటనలో తెలిపారు.

| | |
|---|---|
| **అధ్యక్షులు** – | శ్రీ కె.హెచ్.కె. ప్రసాద్ |
| **ఉపాధ్యక్షులు** – | శ్రీ చుండూరి నాగేశ్వరరావు, చల్లపల్లి |
| **కార్యదర్శి** – | శ్రీమతి వై. శ్యామల |
| **సహాయ కార్యదర్శి**– | శ్రీ ఆర్. ఎన్. మూర్తి |
| **కోశాధికారి** – | శ్రీ పి.యస్.ఆర్. బోస్, రాజమండ్రి. |

## బాబా సందేశం

**"ఇతరులను సంతోషపెట్టడంలో మీరు సంతోషాన్ని అనుభవించడమే - ప్రేమ"**

అని మెహెర్‌బాబా స్పష్టం చేశారు.

When someone else's happiness is your happiness, that's LOVE

**- మెహెర్‌బాబా**

**గౌరవ సంపాదకులు**
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**040-6555 3218**
**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**
**040-65699611**

## లోపలి పేజీలలో...

| | |
|---|---|
| 1. సంపాదకీయం | 5 |
| 2. నాదినే టాలిస్టాయ్ | 6-11 |
| 3. జొన్నాడలో.. .., | 12 |
| 4. హిందీ సహవాస్ | 13-19 |
| 5. లార్డ్ మెహెర్ | 20-28 |
| 6. ఆలీషా | 29-32 |
| 7. మా మాటలు | 33 |
| 8. అవతార్ మెహెర్‌బాబా యెడల విశ్వాసం | 34-36 |
| 9. గుర్తుంచుకోండి !! | 37 |
| 10. ప్రార్థనలు | 38-39 |

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

**మనవి**

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com

# రాజాం

రాజాం బాబా సెంటర్ **29వ వార్షికోత్సవం** సందర్భంగా 20.09.2015 ఉ. 7 నుండి మ. 2 గం.ల వరకు శ్రీ శ్రీనివాస కళ్యాణ మండపంలో ప్రేమిక సహవాస్ నిర్వహిస్తున్నట్లు శ్రీ పి.వి. రమణమూర్తి (94408 87731) ఒక ప్రకటనలో తెలిపారు.

# నిజామాబాద్

నిజామాబాద్‌లోని ఎల్లమ్మగుట్ట ప్రాంతంలో గల మెహెర్‌బాబా సెంటర్ 52వ వార్షికోత్సవం సందర్భంగా 25.10.2015 ఉ. 8 నుండి సా. 6 గం.ల వరకు ప్రేమిక సహవాస్ నిర్వహిస్తున్నట్లు శ్రీ ఎ. జనార్ధనరావు (99087 85774) ఒక ప్రకటనలో తెలిపారు. బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొనవలిసినదిగా ఆయన కోరుతున్నారు.

# హెల్ప్‌లైన్

ప్రతి నెలా 25లోగా మెహెర్‌బాబా పత్రిక పోస్టులో మీకు అందేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. ఐతే, ఏ కారణంగానో నెల చివరిదాకా కూడా పత్రిక పోస్టులో మీకు రాకుంటే హైదరాబాద్ బాబా ప్రేమికులు శ్రీ వి.ఆర్.కె.శాస్త్రి (98492 42284), శ్రీ కాగిత రామ్ (99481 28207) లను సంప్రదించగలరు. **మీ ఇ-మెయిల్ అడ్రస్ పంపితే పత్రికను నెట్‌లో పంపగలము.**

**2015** సెప్టెంబరు సంచికలో

# కూల్దాబాద్ - సాధుసజ్జనుల జన్మస్థానం

**2015 సెప్టెంబరు సంచికలో "కూల్దాబాద్ - సాధుసజ్జనుల జన్మస్థానం" ప్రత్యేక యాత్రా కథనం ప్రచురిస్తున్నాం. బాబా ప్రేమికులు శ్రీ బుదే క్రిష్ణయ్య, సికింద్రాబాద్,(99-08-210580) ఇటీవల కుల్దాబాద్ సందర్శించారు. ఒక దశాబ్ద కాలంలో మెహెర్‌బాబా అనేకసార్లు సందర్శించిన ఈ అద్భుత ఆధ్యాత్మిక సంపద గల చిన్ని గ్రామం గురించి సమగ్రంగా తెలుసుకుందాం!! వచ్చే నెల సంచికలో !! !!**

## సంపాదకీయం

# తేడా వుందా?

పెదవులతో పలకరింపు.. నొసటి వెక్కిరింపులు..
పరనింద ..ఆత్మస్తుతి...ఇదే ఎక్కడ చూసినా మనం చూస్తున్నది!!
**ఇది నేటి సమాజం తీరు.**
**కాదను వారెవవురా!!**
బాబా ప్రేమికులుగా మీలో ఏమైనా తేడా వుందా? మెహెర్‌బాబా మౌనావతారుడు.
మెహెర్‌బాబా 1925 జూలై 10 నుండి మౌనంగా వున్నారు.
మెహెర్‌బాబా1969 జనవరి 31న బాబా భౌతిక దేహ త్యాగం చేశారు.
మెహెర్‌బాబా మౌనంలోనే ఎన్నో ప్రవచనాలు చేశారు.
మెహెర్‌బాబా తన ప్రవచనాలలో ఎక్కువగా
**1. ప్రేమ 2. విధేయత 3. నిస్వార్థ సేవ** గురించి పదేపదే చెప్పారు.
ఈ మూడింటిలో కనీసం ఏ ఒక్కదాన్నైనా నిత్యజీవితంలో ఆచరణలో ప్రయత్నించడం ద్వారా మానవ జీవిత లక్ష్యమైన భగవదైక్యం సాధ్యమౌతుందన్నారు.
ప్రేమ గురించి మెహెర్‌బాబా ఎన్నో సందర్భాలలో ఎన్నో విధాల చెప్పారు.
**భగవంతుడు అంటే ఎవరు? అని ప్రశ్నిస్తూ, ప్రేమే భగవంతుడు అని స్పష్టం చేశారు.**
**మీలోని సంకుచిత భావాలే మీలోని ప్రేమను కట్టడి చేస్తోందన్నారు.**
నిత్యజీవనంలో ప్రేమ గురించి ప్రస్తావిస్తూ..మీ తోటివారితో ప్రేమగా మాట్లాడండి.
తోటివారిని ప్రేమగా పలకరించండి. తోటివారితో ప్రేమగా మసలుకోండి.
ప్రతివానిలో భగవంతుడున్నాడని గుర్తించమన్నారు. ఇతరుల సంతోషం కోసం తాపత్రయపడటమే ప్రేమ అన్నారు బాబా. నేటి సభ్య సమాజానికి కావల్సింది క్రమశిక్షణ గల మతం కాదు ..ఈ సమాజానికి ప్రధానంగా ప్రేమ కావాలి.. ఇది తక్షణావసరం అన్నారు బాబా. మీ తోటివారిలో తప్పులు వెదకడంకంటే, మీలోని తప్పొప్పులు బేరీజు వేసుకోవడమే భగవంతుడిని ప్రేమించడమవుతుందన్నారు. ప్రేమ ద్వారా సాధించలేనిది ఏమీ లేదన్నారు. **నా మతం ప్రేమ అన్నారు మెహెర్‌బాబా. మానవాళికి నా సందేశం ప్రేమ అన్నారు మెహెర్‌బాబా.** నిస్వార్థ సేవ, ప్రేమ ...ఈ రెండూ దైవీలక్షణాలు.
మెహెరుని ప్రవచనాలు నిత్యనూతనం కావాలి!!
మెహెర్‌బాబా భక్తులు, తమని మెహెర్ ప్రేమికులుగా పిలవడం సబబు అంటారు.
**మెహెర్ ప్రేమికులు బాబా ప్రవచనాలు వల్లె వేయడమా?ఆచరణలోనూ చూపడమా అంటే,**
నా ప్రేమికుడు నా సందేశాలకు ఒక ఉదాహరణగా ఉండాలన్నారు మెహెర్‌బాబా!!
మెహెర్‌బాబా ప్రేమికులమని పిలిపించుకోవాలనేవారిలో కూడా... ముందు పేరాలలో బాబావారు చెప్పినట్లు...(?) **సంకుచిత భావాలే ప్రేమను కట్టడి చేస్తోంది!!** ❋

# నాదినే టాలిస్టాయ్

నాదినే టాలిస్టాయ్ రష్యన్ దేశీయురాలు. ప్రముఖ గ్రంధకర్త **వార్ అండ్ పీస్** రాసిన లియో టాలిస్టాయ్ గారి కుమారుడు ఇలియా టాలిస్టాయ్ ఈమె భర్త. శ్రీమతి నాదినే మెహెర్‌బాబాను తొలిసారిగా 1931 నవంబరులో అమెరికాలోని హర్మన్ పట్టణంలో దర్శించుకుంది. ఒక ఆధ్యాత్మిక గురువు అన్వేషణలో వున్న ఆమెకు, తాను ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న గురువు లభించినట్లు, అవతారుని దర్శనం కాగానే **నేను జీసస్‌ను చూశాను** అని బిగ్గరగా అరిచినట్లు స్థానిక బాబా ప్రేమికులు చెప్తారు. నాటి నుండి అవతారుని అంకితమైన నాదినే తన జీవిత చివరిక్షణం వరకూ అవతారుని నామస్మరణలో గడిపింది. **పాశ్చాత్య బాబా ప్రేమికులు శ్రీమతి నాదినే టాలిస్టాయ్, శ్రీమతి నోరినా మ్యాచ్‌బెలీ, శ్రీమతి ఎలిజెబెత్ పాటర్‌సన్‌లను బాబా తన ముఖ్యమైన పాశ్చాత్య స్త్రీ మండలి సభ్యులుగా వర్ణించారు. వీరిని బాబా పాశ్చాత్య బాబాప్రేమిక త్రయంగా అభివర్ణించారు.** బాబా తన ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని పాశ్చాత్య స్త్రీ మండలి, తూర్పున పురుషులు విజయవంతంగా నిర్వహిస్తారని 1920వ దశకంలోనే ప్రకటించారు. బాబా తన ప్రేమికులను ఆయన స్వయంగా ఎంపిక చేసుకుంటారని గతంలో అనేక సందర్భాలలో చెప్పుకున్నాం. **నాదినే టాలిస్టాయ్ ఆ కోవకు చెందినదేనని ప్రత్యేకంగా పేర్కొనవల్సిన అవసరం లేదు.** సుమారు 85 సంవత్సరాల క్రితం, 1931లో అవతారుని దర్శించుకుని, సాక్షాత్తూ భగవత్ అవతారంగా నమ్మి తన జీవితాంతం ఆయన సేవలో గడిపిన నాదినే ధన్యురాలు. కాగా, ఈ సంచికలో నాదినే టాలిస్టాయ్ గురించిన సంక్షిప్త, సమగ్ర సమాచారాన్ని ఈ తరం ప్రేమికుల కోసం ప్రత్యేకంగా అందజేసే ప్రయత్నం చేస్తున్నాం. దయచేసి పరిశీలించగలరు.

***

రష్యన్స్‌లో ఆధ్యాత్మికంగా ఉన్నతస్థాయిని చేరుకున్నవారు చాలామంది వున్నారు. అలాగే, ఆధ్యాత్మికంగా ఎదగాలని ఆకాంక్షించే రష్యన్‌లు చాలామంది వున్నారు. ఐతే, ఆ దేశీయులంటే ఈ తరంలో, పలువురికి పలు అభిప్రాయాలుండొచ్చు. రష్యన్‌లు రాసిన గ్రంథం The Way of a Piligrim ప్రపంచ ప్రసిద్ధి చెందింది. ఈ గ్రంధాన్ని 1884లో రష్యాలోని కాజన్‌లో ముద్రించారు. నిరంతరం జీసస్ పవిత్ర నామస్మరణతో భగవసానిధ్యం సాధించవచ్చున్నది ఈ గ్రంధంలోని పధాన ఇతివృత్తం. ప్రముఖ రష్యన్ కవి పండితుడు **'లియో టాల్‌స్టాయ్'** రాసిన **RESURRECTION** గ్రంథంలోని **(పునరుత్థానం, 'పునర్జీవనం')** **పలు** ఆధ్యాత్మిక అంశాలపై మహాత్మా గాంధీ కూడా ప్రభావితుడయ్యాడని చెప్తారు. ఒక సందర్భంలో నాదినే టాల్‌స్టాయ్‌తో బాబా మాట్లాడుతూ మీ మామ గారైన



మెహెర్‌బాబాతో నాదినే

లియో టాయ్‌స్టాయ్ ఎదురు చూసిన 'భగవదైక్యం' నీకు తప్పక లభిస్తుందని హామీ ఇచ్చారు. టాల్‌స్టాయ్ గారి కుమారుడు **ఇలియా టాల్ స్టాయ్‌ని** నాదినే పెళ్ళి చేసుకుంది. వారిద్దరిదీ ప్రేమ వివాహం. వీరిద్దరూ కూడా సత్యాన్వేషకులు.

**METAPHYSICS STUDENTS** అంటే ఈ జగత్తు, ఈ జగతికి మూలాధారం ఏమిటి? అనే విషయాన్ని అధ్యయనం చేసే విద్యార్థులు వీరు!! ప్రేమ, ఆ దరిమిలా పెళ్ళి కంటే ముందరే, ఇలియా టాల్‌స్టాయ్‌ని నాదినే కలలో ఊహించుకుందట. అలా అనేకంటే, ఆమె తన ఇలియా టాల్‌స్టాయ్‌ని స్వప్నంలో తొలిసారిగా చూసిందట.

పెళ్ళయిన తర్వాత వీరిద్దరూ రష్యా నుండి అమెరికాలోని న్యూయార్క్‌లో స్థిరపడ్డారు. ఈ సమయంలో పరాయి దేశంలో ఒంటరితనంతో పాటు ఆరోగ్యం, ఆర్థిక సమస్యలు చాలా కాలం వారిని వెంటాడాయి. ఈ కష్టాల నుండి దూరంగా వెళ్ళేందుకు నాదినే టాల్‌స్టాయ్ ఆధ్యాత్మిక అన్వేషణలో అనేక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నది. ఆమె భగవద్గీతను అసాంతం అనేకసార్లు చదివి ఆకళింపు చేసుకునే ప్రయత్నం చేసింది. స్వామి యోగానంద ఆధ్వర్యంలో ఆమె ధ్యానం, **'క్రియా యోగ'** ను అనుసరించింది. ఈ యోగా ధ్యానంలో ఆమె తగినంత అనుభవం లేకపోవడంతో అనేక కష్టాలు అనుభవించింది. దాంతో కొన్ని దుష్ప్రభావాలు ఆమెపై పడ్డాయి. ఈ సమయంలో తగిన గురువు సహాయం అందించమని ఆ భగవంతుడిని అనేకమార్లు ఆమె ప్రార్థించింది. నిజమైన గురువు సహాయం కోసం చాలా సంవత్సరాలు ఆమె

ఎన్నో ప్రయత్నాలు చేశింది. ఎన్నో ప్రదేశాలకు వెళ్ళింది. అనుకోకుండా ఒకరోజున వీరి స్నేహితుడైన మాల్కం స్లాస్ నుండి ఆమెకు ఆహ్వానం అందింది.

సద్గురువు శ్రీ మెహెర్‌బాబా అమెరికాలోని హర్మన్‌కు వస్తున్నారని, సద్గురు దర్శనం పొందమని 1931 నవంబరు 19న స్లాస్ ఆహ్వానం పంపాడు.

ఆమె హర్మన్‌లో తొలిసారిగా బాబాను దర్శించుకుంది. ఆ దర్శనంతో "నన్ను నేను మరచిపోయాను. బాబావారి దివ్య తేజస్సులో నాకు జీసస్ దివ్య దర్శనం లభించింది. ఆయన్ని చూస్తూనే "జీసస్ క్రీస్తు" అని బిగ్గరగా అరిచేశాను. ఆయన కళ్ళలో దివ్య ప్రేమ కనిపించింది. ఎంతోకాలంగా నేను చూస్తున్న ఎదురుచూపులకు జవాబు దొరికినట్లైంది. నా జీవితం ఆయన పాదాల చెంత వుంచాలని ఆ క్షణంలోనే నిర్ణయించుకున్నాను. నేను బాబావారున్న గదివైపు వెళ్తుంటే, ఆ గదిలో **'ఓం'** అనే నామస్మరణ వినపడింది. ఆ గదిలో కోటి సూర్యకాంతులీనుతూ, ప్రకాశవంతంగా వెలిగిపోతున్న దివ్యావతారుని దర్శనం లభించింది. ఆ దివ్యావతారుడిని మాటల్లో వర్ణించడం అలవికానిది. ఎంతోకాలంగా నాకు తెలిసిన వ్యక్తిలా అగుపించాడు.

నన్ను గుర్తుపట్టలేదా? ఇంకా నేనెవరో గుర్తుకు రాలేదా? అని బాబా నన్నడిగారు.

ఆ క్షణంలో ఆయనే నా దైవం - సర్వస్వం అనిపించింది.

ఆ తర్వాత నీవు నా కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నావ్.

ఇదిగో నేను వచ్చాను.

నా సహాయం నీకు లభిస్తుంది అని బాబా అక్షరఫలకంపై రాశారు.

నేను నా గురించి ఏదో చెప్పబోయాను.

నా మాటలకు బాబా అడ్డుతగులుతూ, నాకంతా తెలుసు.

నా సహాయం నీకు తప్పక లభిస్తుంది. దిగులు చెందవద్దు అన్నారు బాబా.

ఆ మర్నాడు నా భర్త ఇలియా బాబాను దర్శించుకున్నాడు.

**అడుగడుగునా స్వార్థం - దుర్మార్గంతో నిండి వున్న ఈ సమాజంలో ఎవర్నైనా ఒకరినొకరు ఎలా ప్రేమించగల్గుతారు బాబా అని, ఇలియా అడిగాడు.**

ఈ ప్రశ్న ఆయన మనస్సులో ఎంతో కాలంగా అపరిష్కృతంగా వుంది.

ప్రేమ నిండిన అవతారుడు, "ప్రేమ"తోనే నీవు దాన్ని జయించాలని అక్షర ఫలకంపై జవాబిచ్చారు. నీ హృదయం ప్రేమతో నిండాలి, అని బాబా జవాబిచ్చారు.

**నీవు మంచివాడివని** బాబా ఇలియాకు కితాబిచ్చారు.

త్వరలో మీకు అన్నీ అర్థమవుతాయన్నారు.

నేను తొలిసారిగా దైవీ ప్రేమను చవిచూశానని, ఇలియా తన మిత్రులతో అన్నాడు. ఆ దరిమిలా, సుమారు ఏడాదిన్నరలోగానే తీవ్ర అనారోగ్యంతో ఇలియా 1933లో తుదిశ్వాస విడిచాడు. మెహెర్‌బాబాకు ప్రియమైన ప్రేమికునిగా ఇలియా టాల్‌స్టాయ్

బాబాలో ఐక్యమయ్యాడని నాడినే తన భర్త గురించి చెబుతుంది.

ఇలియా టాల్‌స్టాయ్ జర్నలిస్టుగా పనిచేశాడు. 1918 ప్రాంతంలో రష్యన్ రివల్యూషన్ సమయంలో అమెరికాలో వచ్చి స్థిరపడ్డాక సినిమా చిత్రీకరణ కూడా ఆయన చేపట్టాడు.

తొలిసారిగా కలిసిన నాడినేతో బాబా,

**'క్రియో యోగ'** ప్రాక్టీసు ఆపివేయమన్నారు. యోగా ఇప్పటికే నీ ఆరోగ్యం పాడు చేసిందన్నారు. ముఖ్యంగా నీకు యోగా పనికిరాలేదన్నారు. 'యోగా' పశ్చిమ దేశీయుల కోసం కాదన్నారు. క్రియా యోగాలో నాడీ వ్యవస్థలోని చక్రాల ద్వారా కుండలినీ శక్తిని పెంపొందిస్తారు. ఈ యోగాను ప్రాక్టీసు చేయడం వల్ల నాడినే ఆనారోగ్యం పాలైంది. ఈ రోగం పేరు **LoU GEHRIG's.** ఇది నరాలు-నాడీ వ్యవస్థకు సంబంధించిన వ్యాధి. దీని వల్ల క్రమేపీ మాట్లాడ్డం, ఆహారం మింగడం, చివరకు ఊపిరి పీల్చడం కష్టతరమౌతుంది. నాదినే తన తొలి దర్శనం గురించి ఇంకా చెబుతూ ఇలా అన్నారు.

ఆ తర్వాత నన్ను ఓ ప్రక్కగా కూర్చోమన్నారు.

ఆ సమయంలో బాబా నాకు సహాయం చేస్తారనిపించింది.

ఆయన నా మనస్సులోని భావాలను చదువుతున్నారనిపించింది.

నేను ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న గురుదేవుడనిపించింది.

నాకెంతో ధైర్యం వచ్చింది. మనస్సు తేలికయ్యింది.

సూర్యభగవానుడి మాదిరి వాడనుకున్నాను. నేను భగవద్గీత చదివాను కదా!!

ఆ క్షణంలో ఈయన సాక్షాత్తూ శ్రీకృష్ణ భగవానుడనుకున్నాను.

## నాడ్జా

ఈమె అసలు పేరు నాడ్జా. బాబా స్త్రీ మండలిలో అప్పటికే 'నాజా' పేరుతో ఒకరున్నారు. అందుకనే నా పేరును 'నాదినే' అని బాబానే మార్చారు.

బాబా ఆశ్రమంలో నేనున్న రోజుల్లో ఒక ఏడాదిపాటు మౌనం పాటించమని బాబా ఆదేశించారు. బాబాను కలిసిన సందర్భంలో బాబా ఇలా అన్నారు.

నా బాధలన్నీ తొలగిపోతాయని భరోసా ఇచ్చారు. శాశ్వతమైన ఆనందాన్ని నేను ప్రసాదిస్తానన్నారు. **YOU ARE A BEAUTIFUL SOUL.**

నీవొక పరిశుద్ధమైన ఆత్మవి అన్నారు బాబా.

***

నాదినే టాల్‌స్టాయ్ 1884 రష్యాలోని బెర్నాడ్, ఒడెస్సాలో జన్మించింది.

ఆమె సంగీతం అభ్యసించింది. అనేక భాషలు అధ్యయనం చేసింది.

1934 నవంబరు 22న నాదినేతో బాబా మాట్లాడుతూ

కష్టాలు ఆధ్యాత్మిక ప్రగతికి తొలిమెట్టు. అవి జీవిత లక్ష్యం వైపు నడిపిస్తాయి.

సత్యాన్వేషణకు మార్గం చూపిస్తాయి. నీవుగా నా దగ్గరకు వచ్చావు.
నీ కష్టాలు నిన్ను నాకు సన్నిహితంగా చేరుస్తాయి.
నా మీద ప్రేమ, భక్తి, విధేయతకు అవి సోపానాలవుతాయి.
1937వ దశకంలో నాదినే బాబావారు నాసిక్‌లో నిర్వహిస్తున్న ఆశ్రమంలో వచ్చి చేరింది. అప్పటికి ఆమె భర్త ఇలియా మరణించాడు.

## నీలోనే భగవంతుడున్నాడు

నాసిక్‌లో వున్న రోజుల్లోనే ఒక సందర్భంలో, నాదినే అడిగిన ఒక ప్రశ్నకు జవాబుగా బాబా ఇలా అన్నారు. నీవిప్పుడు నాదినేవు. అదే సమయంలో దేవుడవు, భగవంతుడవు కూడా. ఎప్పుడైతే నాదినే అదృశ్యమవుతుందో ఆమెలో వున్న దేవుడు ఒక్కడే మిగులుతాడు. కాబట్టి నాదినేలో నేను అనే భావం పోవాలి.
ఆ నేను అనే భావంపోతే నీలో భగవంతుడొక్కడే వుంటాడని బాబా సూక్ష్మంగా చెప్పారు. నాదినేనే తనకుతానుగా తనలోని "నేను" అనే భావం అదృశ్యమయ్యేలా చూడాలి. ఇందుకు నిన్ను - నీవు - మరచిపోవాలి.
అదెలా సాధ్యమౌతుంది? నీ గురించి తక్కువ ఆలోచించు.
భగవంతుడు, బాబా గురించి నిరంతరం ఆలోచిస్తూ వుండు, అని బాబా అన్నారు.

## భగవంతునిలో ఐక్యం సాధ్యమా?

ఇలా అస్తమానం ఆలోచించకుండా అంతా బాబాకి అన్నీ వదిలి ఆయన నామస్మరణలో, ఆయన ఆలోచనలతో వుండు. అన్నీ సాధ్యమౌతాయని బాబా స్పష్టం చేశారు.
అన్నింటికంటే ప్రధానం - నేను చెప్పినట్లు విధేయత పాటించండి.
విధేయత ప్రధానం. బాబా నవ్వుతూ ప్రేమ ముఖ్యమైనది అన్నారు.
1937 జూలై 8న బాబా ఆదేశాల మేరకు నాదినే ఇటలీ దేశంలోని వెనిస్‌కు బయల్దేరింది. బాబా ముంబాయి దాకా వచ్చి ఆమెకు వీడ్కోలు చెప్పారు.
మౌంట్ ఎవరెస్టు పర్వతం మీదకు ఎక్కి మెహెర్‌బాబా సాక్షాత్తూ ఈ యుగావతారుడు, అవతారమూర్తి, భగవంతుడు. రండి! రండి! వచ్చి తరించండి అని ఎలుగెత్తి చాటగల ధీర వనిత నాదినే అని బాబా ఆమెను ఒక సందర్భంలో అభినందించారు.
ఆమె బాబాని అమితంగా ప్రేమిస్తోందని బాబా కితాబిచ్చారు.
నాదినే మెహెర్‌బాబా నాసిక్ ఆశ్రమంలో భాగంగా నిర్వహించిన ఆసుపత్రిలో నర్సులాగా పలువురు స్థానిక రోగులకు సేవలందించింది.
అనేక సమావేశాలలో బాబా గురించి సి.డి. దేశ్‌ముఖ్, నోరినా మ్యాచ్‌బెలీల సరసన బాబా గురించి అనర్గళంగా ప్రసంగించింది.

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రాంగణంలో
నవంబరు 9, 1939లో పెద్ద బహిరంగ సభ ఏర్పాటు చేశారు.
డా॥ సి.డి. దేశ్‌ముఖ్, నోబుల్ బహుమతి గ్రహీత డా॥ సి.వి. రామన్ కూడా
ఆ సమావేశానికి హాజరయ్యారు.
ఆ సభలో కూడా నాదినే అవతారుని ప్రవచనాలను ఆసక్తికరంగా ప్రసంగించింది.
ఎవరైనా మెహెర్‌బాబా ఎవరు అని ప్రశ్నిస్తే మీ సమాధానం ఏమని
నాదినే, నోరినా మ్యాచ్‌బెలీలను బాబా అడిగారు.
నాదినే ఏమాత్రం తడుముకోకుండా
**గాడ్ – భగవంతుడు** అని జవాబిచ్చింది.
నోరినా మ్యాచ్‌బెలీ మాత్రం మెహెర్‌బాబా – **గాడ్ మాన్ అని** జవాబిచ్చింది.
బాబా నోరినాకు ఎక్కువ మార్కులిచ్చారు.
మెహెర్‌బాబా గాడ్ కాదు, **గాడ్ మాన్** అన్నారు.
**గాడ్ మాన్ – గాడ్ కంటే ఉన్నతుడన్నారు బాబా.**
God is Absolute.
one who manisfests the abosolute is the God-Man.
The person who is one with God is Man -God,
it is wrong to say just God. Jivatma means Man.
Mahatma means piligrim on the path. Paramathma means God.
when jeevatma becomes one with the Paramatma,
man is called Shivatma.
Paramatma cannot be called Shivatma,
అని బాబా తన ప్రవచనంలో చెప్పారు.
అమెరికా వెళ్ళిన తర్వాత నాదినే అనారోగ్యంతో బాధపడింది.
1946 ఏప్రిల్ 14న 62 సంవత్సరాల వయస్సులో నాదినే న్యూయార్క్‌లో
బాబాలో ఐక్యమయింది.
బాబాకు ఈ కబురు అందుకుని, నాదినేని వుద్దేశించి బాబా ఇలా అన్నారు.
Nadine lives in Me, more than ever before.
బాబావారు స్వయంగా నాదినే సమాధిని ఎగువ మెహెరాబాద్‌లో
బాబా సమాధి చెంతనే ఏర్పాటు చేశారు.
**HER HAPPINESS IS BABA** అని
ఆమె సమాధి ఫలకంపై బాబా రాయించారు.
భగవంతుని సన్నిధిలో గడిపిన నాడినే ధన్యురాలు..,

# జొన్నాడ బాబా సెంటర్

ఇటీవల గోదావరి పుష్కరాల సందర్భంగా జొన్నాడ బాబా సెంటర్ బాబా ప్రేమికులు విశేష సేవలు అందించారని ప్రశంశిస్తూ పత్రికలో వచ్చిన క్లిప్పింగ్‌ను పంపించారు. ఈ పత్రికా ప్రకటన మీరూ పరిశీలించండి.



## 'మెహెర్‌బాబా' సేవలు ప్రశంసనీయం

# ఎర్రని అడ్రస్సులు

గత ఆరు మాసాలుగా సుమారు 200 మంది అడ్రస్సులకు ఎర్రని అక్షరాలతో టైపు చేసిన అడ్రస్సు స్లిప్పులతో మెహెర్‌బాబా పత్రికను పోస్టు చేస్తున్నాం.

వీరందరూ గత రెండేళ్ళకు పైగా వారి వారి వార్షిక సభ్యత్వం చెల్లించలేదని వివరంగా తెలియజేస్తూ, ఈ మాదిరి ఎర్ర స్లిప్పులతో పంపుతున్నాం. ఆరు నెలలు నుండి పంపుతున్నా సదరు సభ్యులలో మార్పు రానుందున, వీరందరికి 2015 సెప్టెంబరు సంచిక తర్వాత పత్రికలు పంపడం నిలిపేస్తున్నట్లు తెలియజేస్తున్నాం. దయచేసి తమ వార్షిక సభ్యత్వం రూ. 100 లేదా జీవిత సభ్యత్వం రూ. 1000 పంపి పత్రికా నిర్వహణలో సహకరించవల్సిందిగా కోరుతున్నాం. మెహెర్‌బాబా పత్రికను మీ బంధు మిత్రులందరికీ అందజేయండి. బాబానామ వ్యాప్తిలో మీవంతు కృషి చేయగలరు. జైబాబా.

# హిందీ సహవాస్

ఆ తర్వాత బాబా **"నేను"** , **"నాది"** గురించి ప్రవచనం ఇచ్చారు.
మీరు చెప్పే నేనుకీ, నేను నేనుగా చెప్పే నేనుకీ చాలా తేడా వుందన్నారు.
ప్రతి ఒక్కరూ తమరిలో భగవంతుడు వున్నాడనుకుంటారు.
ఇందుకు కేవలం మానవ మేధస్సు సరిపోదు.
గట్టి విశ్వాసం కావాలి.
చాలా తేలికగా, **'నేనూ భగవంతుడినే'** అని ప్రకటించుకోవడం
గొప్ప కపట నాటకమౌతుంది.
ఇది భగవంతుడు ఇష్టపడడు.
నేను పురాణపురుషుడను.
నేను సత్యం, శివం, సుందరం.
నేను ప్రతి ఒక్కరిలోనూ ఉన్నాను.
ఉదాహరణకు, ఏరుచ్ తన గురించి ఏరుచ్‌గా పూర్తిగా తెలుసు కాబట్టి,
తన పేరును స్పష్టంగా ఏరుచ్ అని చెప్తాడు.
అదేవిధంగా, నేను పురాణపురుషుడను.
అనాదిగా నేను అవతరిస్తున్నాను.
మీరు భగవద్వచనం చదివితే
మీకు భగవంతుడు అంటే ఎవరో అర్ధమౌతుంది. ఆ గ్రంథం చదవడం వల్ల
మీకు భగవంతుడు అంటే ఏమిటో తెలుస్తుందేమో కానీ,
భగవంతుడు అంటే ఎవరో అనుభవంలోకి రాదు అని బాబా స్పష్టం చేశారు.
రేపొద్దున్న మీకు **'ప్రేమ-విధేయతల'** గురించి వివరిస్తానన్నారు.
మీరు ఇక్కడికొచ్చి నా ఎదుట మీ క్షేమం గురించి, భార్యా పిల్లల ఆరోగ్యం,
ఐశ్వర్యం ఇత్యాదులు గురించి నన్ను అడగొద్దు.
నా ఆశీస్సులు కోరడానికి ఇది అందివచ్చిన అవకాశం అని మీరు భావించొద్దు.
మీరలాంటి ఆలోచనలతో ఇక్కడకు వచ్చినట్లయితే
ఇప్పటిదాకా మీ దగ్గర ఏదైనా మీకు **మేలు-మంచి** ఏదైనా జరిగి వుంటే,
అది కాస్తా మటుమాయమయ్యే అవకాశం ఉంది.
ఇలాంటి వాటి కోసం అనేకమంది సాధువులు, మహాత్ములు, వలీలు ఉన్నారే,
వారిని ఆశ్రయించడం సబబు అన్నారు. వారి దగ్గరకి వెళ్ళి మీ కోరికలు నెరవేర్చుకోండి.
భగవంతునిలో చేరడం మానవ జీవిత లక్ష్యం కావాలి.

మీరు ఆ లక్ష్య సాధన ఆశించినట్లయితే నా కొంగు పట్టుకోమన్నారు.
తెలుగు సహవాస్‌లో వివరించినట్లు మూడు రకాల వ్యాపారులు –
షా సౌదాగర్, టోకు వ్యాపారి, చిల్లర వ్యాపారుల విషయాన్ని,
వారి మధ్యవున్న తేడాలను, బాబా తిరిగి వివరించారు.
సహవాసీలందరూ మధ్యాహ్న భోజనానికి వెళ్ళేముందు అంతక్రితం రాత్రి
మెహెరాజాద్‌లో బాబావారు ఏరుచ్‌కి చెప్పిన ఒక సందేశాన్ని చదివి వినిపించమన్నారు.
**తల మీద వెంట్రుకలు – శిరస్సు** ప్రాధాన్యతలకు సంబంధించినదీ సందేశం.
ఆ సందేశం ఇలా వుంది.
భగవంతుడు అనంతజ్ఞాన సంపన్నుడు.
మీరు చూస్తున్న ఈ ప్రపంచమంతా పెద్ద మాయ. అంతా మిధ్య.
అయితే భగవంతుడు ఒక్కడే.
అనంతమైన మాయ ద్వంద్వంలో వుంది.
భగవంతుడు అన్ని కాలాలలో వున్నాడు.
మాయ అన్ని కాలాలలో వుండదు.
మాయ ఉన్నా లేకపోయినా భగవంతుడు మాత్రం ఆదిమధ్యాంతరహితుడు.
ఆయనకి **ఆది** = మొదలు, **మధ్యమం**, **అంత్యం** = చివర లేదు.
ఈ యావత్తు సృష్టి మాయామయ జగత్తులో పరిభ్రమిస్తోంది.
ఇందుకు ఉదాహరణగా చెప్పాలంటే..,
ప్రతి వ్యక్తి తల మీద అసంఖ్యాకమైన వెంట్రుకలు పెరుగుతున్నాయి.
ఆ వెంట్రుకలను కత్తిరిస్తే, తిరిగి అవి వాటి మానాన పెరుగుతాయి.
తల మీద వెంట్రుకలన్నీ తొలగించి గుండు గీయించినా
తిరిగి ఆ వెంట్రుకలు రాక మానవు.
కొద్దిరోజుల తర్వాత తిరిగి తలపై వెంట్రుకలు పెరుగుతాయి.
ఇది మనందరం గమనిస్తున్నదే.
ఒకవేళ తలమీద వెంట్రుకలు అన్నీపోయి బట్ట తల అయినా
వెంట్రుకలు పెరగవేమోగాని
తల మాత్రం అలాగే వుంది కదా.
ఇది మనకు తెలిసిన విషయమే కదా.
తలమీద మొలచిన అసంఖ్యాకమైన వెంట్రుకలకు విలువ ఏమీ లేదు.
తల మాత్రమే విలువైనది.
తలమీద వెంట్రుకలు పెరుగుతాయి.
వాటిని మనం కత్తిరిస్తుంటాం.

తిరిగి అవి పెరిగినా, అవి అలంకారప్రాయమనే మనం గుర్తించాలి.
వెంట్రుకలకు మనం ఇచ్చే ప్రాధాన్యత అలాంకారానికే పనికొస్తుంది.
ఈ వెంట్రుకలు ఒక రకంగా చెప్పాలంటే స్వయం సంతృప్తికి మాత్రం పనికొస్తాయి.
అలాగే, ఒక వ్యక్తి యొక్క మనస్సుని ఆతని శిరస్సుతోనూ,
ఆ మనస్సు ద్వారా అనుక్షణం ఉద్భవించే అనేక వేల ఆలోచనలను
తల మీద మొలిచే వెంట్రుకలతోనూ పోల్చవచ్చు.
మానవ మనస్సు అనేక వేల ఆలోచనలకు కేంద్ర బిందువు.
అపరమితమైన శక్తి మానవ మనస్సు నుండి ఉద్భవిస్తుంది.
భగవంతుడు ఒక్కడే సత్యం, నిత్యం.
ఈ విషయాన్ని అర్థం చేసుకోవడానికి భగవంతుడుని మనస్సుతోనూ,
తల మీద పెరిగే వెంట్రుకలను ఈ సృష్టితోనూ కొన్ని క్షణాలు సరి పోల్చుకుందాం.
అలాంటప్పుడు మనస్సు ఒక్కటే ప్రధానమని,
ఈ సృష్టి అంతా వ్యర్థమని మనకు అవగతమౌతుంది.
బాబా నవ్వుతూ నిన్న సాయంత్రం మెహెరాజాద్‌లో శత్రుఘ్న కుమార్‌ని చూసినప్పుడు
నాకు ఈ విషయాలు గుర్తుకొచ్చాయన్నారు.
శత్రుఘ్న కుమార్ తలపై వెంట్రుకలు ఒక్కొక్కటీ రాలిపోతున్నాయి.
త్వరలో బట్టతలగా మారుతోంది.
అది చూసిన నాకు ఈ కథనం చెప్పాలనిపించిందని బాబా అన్నారు.
ప్రేమ ద్వారానే మీరు నా దరి చేరగల్గుతారని బాబా సహవాసీలతో అన్నారు.
నేను నా ప్రేమను ఇవ్వడానికి సిద్ధంగా వున్నాను.
అయితే, నా ప్రేమను అందుకోవడానికి మీరు సిద్ధంగా వుండాలి.
అందుకు ధైర్యం కూడా తోడవ్వాలి అన్నారు.
అనంతరం అందరూ మధ్యాహ్న భోజనానికి నిష్క్రమించారు.
హిపోక్రసీ గురించి ప్రస్తావిస్తూ, బాబా ఇలా అన్నారు.
హిపోక్రసీ అంటే కపటం. లోపల ఒకటి, బయటకు మరొకటిలా ప్రవర్తించడం.
ఈ మాదిరి కపటాన్ని భగవంతుడు ఏమాత్రం క్షమించడు.
ఒక దుర్మార్గుడైనా, అతడెంత తప్పుపని చేసినా,
తాను చేసిన తప్పుని ఉన్నది వున్నట్లుగా ఒప్పుకుంటే,
భగవంతుడు అతడ్ని క్షమించి వదిలిపెడతాడు.
కానీ, అతనేదో గొప్ప పండితుని మాదిరిగా,
పలువురి మంచి కోరే పెద్దమనిషిగా నాటకమాడితే,
దేముడు అతడినెన్నడూ క్షమించడని బాబా స్పష్టం చేశారు.

ప్రపంచంలో ఈ మాదిరి కపట సన్యాసులు ఏడుగురున్నారు.
వారిలో ఓ ముగ్గురు నల్గురిని నా మండలివారూ గుర్తుపడతారు.
వారేమంటారంటే మెహెర్‌బాబా తమని ఆశీర్వదించాడని,
ఆయన తదనంతర వారసులం మేమేనని చెప్పుకున్నారు.
వీరిలో ప్రతి ఒక్కరికీ పెద్ద ఎత్తున శిష్యులున్నారు.
ధనవంతులు, బాగా పేరు ప్రఖ్యాతలు, పరపతి గలవారూ వారి శిష్యకోటిలో వున్నారు.
ఐతే, ప్రస్తుతం వారిలో మార్పువచ్చింది.
వారు చేసిన తప్పు తెలుసుకున్నారు.
నన్ను క్షమించమని వేడుకున్నారు.
నేను క్షమించాను.
ఐతే ఇప్పుడు వారు గొప్ప సాధు సత్పురుషులని చెప్పుకోవడం మానేశారు.
ఆ విషయం అలా వుంచితే,
మీరు నన్ను నిజంగా ప్రేమిస్తున్నట్లయితే,
ఆ విషయాన్ని దాచిపెట్టాల్సిన పనేమీ లేదు.
ఒకవేళ మీరు నన్ను ప్రేమించనట్లయితే,
ఆ విషయాన్ని దాచిపెట్టాల్సిన పన్లేదు.
మీ మనస్సులో మీరేది తలిస్తే దానిని ఇతరులకు చెప్పండి.
ఒకవేళ మీరు నన్ను ప్రేమించనట్లయితే,
నన్ను అమితంగా ప్రేమిస్తున్నానని, ఆరాధిస్తున్నానని అబద్దాలు చెప్పొద్దన్నారు.
మీరు నన్ను అవతార పురుషునిగా, భగవత్స్వరూపునిగా నమ్మితే,
ధైర్యంగా ఆ మాటనే పలువురికి చెప్పండి.
లేదంటే,  లేదనే చెప్పండి.
కానీ మనస్సులో ఒకటి – బైటకు మరొకటి చెప్పడం హర్షణీయం కాదు.

**నేను పురాణపురుషుడునని మీకు ఎలా తెలుసు?**

బాబా నీవు చెప్పావు కాబట్టి – దాన్ని మేం నమ్మాం అన్నారు.
నా దివ్యాధికారంతో చెబుతున్నాను. నేను పురాణపురుషుడని.
నేను ఆ సనాతనుడను. దేవదేవుడనని సాధికారంగా చెబుతున్నాను.
మీరింత క్రితమే **“అవతార్ మెహెర్‌బాబాకి జై”** అని బిగ్గరగా నినాదాలు చేశారు.
నేను చెప్పిన దాంట్లో ఇసుమంత అనుమానం లేదు.
నేను పురాణపురుషుడను.
ఐతే, అది మీకెలా తెలుసు? అన్నది ప్రశ్న.
ఈ ప్రశ్నకు సహవాసీలు ఎవరూ సరైన జవాబు చెప్పలేకపోయారు.

నీవు చెప్పింది మేం మనసారా నమ్ముతున్నాం బాబా
అని మాత్రం కొందరు చెప్పారు.
ఇందుకు బాబా వివరణ ఇస్తూ –
మీరు నమ్మిన మాట నిజమైతే సరే!
లేదంటే మీ మనస్సులో నా గురించి మీరు ఏమి భావిస్తే
దాన్నే బహిరంగంగా చెప్పండి.
నిజంగా, నిర్భయంగా, నిర్భీతితో మీరేది నమ్మితే దాన్ని స్పష్టంగా ప్రకటించండి.
మీ మనస్సులో వున్న నమ్మకాన్ని మాత్రమే గట్టిగా చెప్పండి.
మీ హృదయంలో ఏమి నమ్మితే దాన్నే చెప్పండి.
హృదయంలో దొంగ బాబా అని,
బయటకు భగవంతుడునని చెప్పొద్దు.
ఇది చాలా ముఖ్యమైన విషయం.
భగవద్వచనంలో ఈ విషయాన్ని చాలా వివరంగా నేను చెప్పాను.
ఉదాహరణకు సహవాసీలలో ఒకడైన శ్రీవాత్సవ నన్ను ఒక భగవంతుని ప్రేమికునిగా భావిస్తే, ఆ మాటనే పలువురికి చెప్పడం మంచిది.
మరొకరు ఏమంటారు,
మెహెర్‌బాబా ఒక సద్గురువు మాత్రమేనంటారు.
ఆయన అవతారుడు కాదనుకుంటారు.
మరికొందరు నన్ను ఒక కపట సన్యాసిననుకోవచ్చు.
మీరేమనుకున్నా ఫరవాలేదు.
మీ ఆలోచనలను, మీ నమ్మకాన్ని మార్చుకోవద్దు.
నేను మీ స్థాయికి దిగి వచ్చాను.
మిమ్మల్ని నా స్థాయికి తీసుకువెళ్ళాలన్నది నా ఉద్దేశ్యం.
మీలో వున్న మంచి – చెడు అన్ని గుణాలు నాకు అర్పించండి.
"Those who lose their all in Me, find their all in Me even after".
భగవంతుడు ఒక్కటే సత్యం.
భారతదేశంలో ఒక్క విషయం మనందరం చూస్తుంటాం.
కాషాయ దుస్తులు ధరించిన సన్యాసి కనిపిస్తే చాలు
అతని చుట్టూ భక్తితో చేరిపోతారు.
క్రమేణా ఈ సంఖ్య వందల నుండి వేల సంఖ్యలో పెరుగుతుంది.
ఈ సందర్భంగా 'ఫకీర్ బువా' గురించి ప్రస్తావించారు.
పూణేలో వుండే ఈ ఫకీర్ బువా గురించి గత సహవాస్‌లో వివరంగా చెప్పారు.

ఫకీర్ బువా పిచ్చెక్కినవాడైనా, అతని పిచ్చి, వెర్రి చేష్టలు చూసి,
అతడేదో ఆధ్యాత్మిక గురువుగా భావించి,
అనేకమంది అతని చుట్టూ పూణేలో గుమిగూడిన సంగతి బాబా గుర్తుచేశారు.
ఆధ్యాత్మిక మార్గం చాలా భిన్నమైనది.
ఈ మార్గంలో ప్రయాణించడం చాలా కష్టం.
ప్రతి అడుగూ చాలా జాగ్రత్తగా నడవాలి.
ఒక్కొక్క అడుగు ముందుకు వేయడంతో, అంటే, ఆధ్యాత్మిక ఉన్నతి సాధించడంతో,
ఆయా వ్యక్తులలో **'నేను'** అనే అహం పెరుగుతుంది.
ఆరాధించేవారి సంఖ్య పెరుగుతున్న కొద్దీ, 'నేను' అనే అహంభావం క్రమేపీ పెరుగుతుంది.
దాంతో ఏదో ఒకరోజున తప్పులో కాలువేయక తప్పదు.
అలా కాలుజారి క్రింద పడ్డాక కానీ
తాను చేసిన తప్పు ఏమిటో అతనికి అంతుపట్టదు.
తనకింకా భగవస్సాక్షాత్కారం లభించలేదన్న సంగతి తెలుసుండి కూడా
తన చుట్టూ చేరిన శిష్యకోటిని ప్రేమతో ఆశీర్వదిస్తాడు.
ఆ మాదిరిగా, ప్రవర్తించడం ఎంత వరకు సబబు!!
ఈ సహవాస్ పాల్గొన్న ప్రతి ఒక్కరూ
తమ గురించి తాముగా,
నేను ఇక్కడ కూర్చున్నాను.
నేను గొప్పవాడను, నేను బాగా డబ్బులున్నవాడిని. నేను ధనవంతుడిని,
నేను చాలా ఆనందంగా వున్నాను, లేదా నేను దు:ఖంలో వున్నాను.
ఏరుచ్ – తన గురించి ఏరుచ్‌నని, నేను నిరంజన్ సింగ్ అని,
ఇలా **నేను – నేను** – గురించి నిరంతరం ఆలోచిస్తుంటారు.
క్రమేణా **ఈ 'నేను' గురించి** అధికంగా ఆలోచిస్తూ వుంటారు.
అదే ఆధ్యాత్మిక మార్గంలో వున్నవారు – ఆ మార్గంలో ఉన్నతస్థాయిలో పయనిస్తూ,
నేను నా శిష్యుల్ని దీవిస్తున్నానంటారు. .
నేను నా శిష్యులకి సంతాన ప్రాప్తి కల్గిస్తున్నాననుకుంటారు.
ఇలా – ఇలా – ప్రతిదానికీ, ప్రతిఒక్కరూ,
తమ గురించి, **నేను – నేను –** అని భావించడం కద్దు!!
ఇంతకీ **ఈ నేను** ఎక్కడ్నుంచి వచ్చింది?
ఏరుచ్ జన్మించినప్పుడు, పసిబిడ్డగా అతనికి ఏమీ తెలియదు కదా!!
ఈ నేను ఎప్పుడు మొదలయ్యిందంటే, ఆకలేసినప్పుడు, అమ్మ దగ్గర
నాకు పాలు కావాలని అడుగుతూ ఈ 'నేను' క్రమేణా రోజులు గడుస్తున్న కొద్దీ

'నేను' ఎంతో గొప్ప అనే భావానికి ఎదుగుతోంది.
ఈ నేను – రోజురోజుకీ బలపడుతుంది.
ఈ 'నేను' క్రమేణా రోజురోజుకీ బలపడుతుండటంతో,
ఏరుచ్ తానెవరు? తానెక్కడ నుండి వచ్చాడు? తానెందుకు ఎందుకు వచ్చాడు?
ఈ జీవన ప్రయాణం ఎక్కడికీలాంటి ప్రశ్నలు అతను ఎవరినీ అడగడు.
మాటవరుసకు కూడా అతనిలో ఈ ఆలోచనలు రావు.
ఈ 'నేను'కు మూలం ఎక్కడ?
దీని మొదలు ఎక్కడుంది? అంటే, వాస్తవానికి
Beyond Beyond స్థితిలో, పరబ్రహ్మ పరమాత్మ స్థితిలో, ఈ నేను లేదు.
ఈ విషయాలు భగవద్వచనంలో వివరంగా చెప్పడమైంది.
ఉన్నఫళంగా, ఒక అల, ఒక పెద్ద సముద్రపు కెరటం,
There was a whim – a lahar - వచ్చి పడింది.
నేనెవరు? నేనెవరో తెలుసుకోవాలని వుంది?
ఈ Original – I - అన్నింటికీ, అందరికీ ప్రధానం.
ఈ నేను – నేటి 'అహం'కారపూరిత నేనుకి ప్రధాన మూలం!!
ఇదే మూలం!! ఆ నేను క్రమేణా పెరిగి,
తిరిగి నేను – భగవంతుడిని అని తెలుసుకుని,
ఆ తర్వాత భగవంతునిలో ఐక్యమయ్యేదాకా ప్రయాణిస్తుంది.
**సృష్టికి ఆది – మొదలు – చివర అనేది ఏమీ లేదు.**
Eternity has no beginning and no end.
ఆ మాదిరిగా భగవంతుడు, పరబ్రహ్మ, పరమాత్మ స్థితి నుండి,
(God's beyond – beyond) ఒక లహర్ ద్వారా వచ్చిన
'నేను' – భగవదైక్యం – భగవత్ సాక్షాత్కారం – బ్రహ్మైక్యం సాధించేదాకా
మరింత బలపడుతూ వుంది.
కాబట్టి, ఒక వ్యక్తి భగవసాక్షాత్కారం పొందే వరకూ
తాను దైవంశ సంభూతుడిని అని
ప్రకటించడం హిపోక్రసీ అవుతుంది. కపటం అవుతుంది.
తాను దైవంతో సమానం అని చెప్పుకోవడం అబద్ధం అవుతుందని
బాబా స్పష్టంచేశారు. ఇప్పటిదాకా హిపోక్రసీ గురించి చెప్పుకున్నాం కదా!
ఇకపై చమత్కారాలు **(మిరకిల్స్)** గురించి చెబుతానన్నారు మెహెర్‌బాబా!!

**(ఆ వివరాలు వచ్చే నెల సంచికలో....)**



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

**ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ**

*(గత సంచిక తరువాయి)*

సరేలే మన మిత్రులు ట్రక్కులో వచ్చిన సంగతి పాఠకులకు తెలుసు.
ట్రక్కులో అదీ ఎడారి దారిలో వస్తే ఎలా వుంటుందో ఊహించగలరు.
ఒళ్ళంతా ఇసుక, తల నిండా ఇసుక, స్నానం చేస్తే బాగుండుననిపించింది.
కాస్తంత ప్రయాణపు బడలిక తగ్గుతుందేమో స్నానంతో అనుకొన్నారు.
అదేమాట బాబావారితో చెప్పారు అక్టోబరు 18వ తేదీన.
ఆయనేమో, సరే స్నానం చేయండి అన్నారు.
బట్టలు కూడా బాగా మాసిపోయినాయి బాబా ఉతుక్కుంటాము అన్నారు నసుగుతూ.
ఏమో ప్రభువుకి ఇష్టం ఉంటుందో ఉండదో ఈ పని,
అయినా ఈ చలి దేశంలో బట్టలు ఎలా ఉతుకుతారు.
అవి ఎలా ఆరతాయి అని అంటారేమో, అన్నీ ధర్మ సందేహలే.
బాబావారితో నిత్యం వుంటున్నా,
బాబావారు ఏమంటారో ఊహకయినా అందదు వాళ్ళకి.
ఏపని చేయాలనుకున్నా, ఏపని చేయాలనిపించినా కూడా ప్రభువు అనుమతి కోరడం ఓ అలవాటు అయింది అందుకనే.
ఈ వేళ ప్రభువును అడిగిన కోర్కె కాదనలేదు.
"మీ ఇష్టం" అన్నారు.
చలి గజగజ ఒణికిస్తున్నా లెక్కచేయకుండా స్నానం చేశారు.
బట్టలు ఉతికి ఆరేశారు. హమ్మయ్య, ఓ పని అయిపోయిందీవాళ అని తృప్తిపడ్డారు.
దుర్నీతికి, నీతి బాహ్యానికీ ఇరానీలు పెట్టింది పేరు అంటారు.
ఇది నిజమా? అబద్ధమా?
ఎందుకీ చెడ్డ పేరు వచ్చింది వాళ్ళకి!
ఈ ధర్మ సందేహ నివృతి అక్టోబరు 19వ తేదీ రాత్రి జరిగింది.
రాత్రి భోజనానికి కూర్చొన్నారు అందరూ.
వడ్డన పూర్తయింది. అప్పుడు బాబావారే స్వయంగా ప్రస్తావించారీ విషయాన్ని.

ఇరానీలని చూసి జాలిపడాలి అన్నారు.
వాళ్ళని తప్పుపట్టి లాభం లేదన్నారు.
అజ్ఞానం వల్లనే వాళ్ళు అలా తయారయ్యారన్నారు.
నేను వచ్చాను కదా పరిష్యాకి. ఇప్పుడు ఇక్కడి వాతావరణాన్ని శుద్ధి చేస్తాను అన్నారు.
ఇండియాకి వాపసు వెళ్ళేలోగానే ఈ పని పూర్తి చేస్తానని బాబావారు అన్నారు.
పరిష్యా ఎంత అదృష్టం చేసుకొన్నదో కదా.
అవతారుడు జొరాస్టరు వెలసిన నేల అది.
నేటి యుగావతారుడు మెహెరుడు పావనం చేస్తున్న గడ్డ ఇది!
అని మండలివారు అనుకొంటూంటే, ప్రభువు వాళ్ళకో పరీక్ష పెట్టాడు.
తప్పుడు పనులు చేస్తే ఒప్పుకోండి మొహమాటం లేకుండా అన్నారు.
నా దగ్గరకి రాకపూర్వం చేసిన తప్పు పని తప్పుపనే కాబట్టి గతంలో తప్పటడుగులు వేసి వుంటే, రఫీమని ఆ మాటకు ఒప్పుకోండి అన్నారు.
తమతో ఉంటున్న తర్వాత కూడా తప్పుడు పనులు చేసేరా అని నిలదీశారు.
ఈవాళ మీరు నిజం చెప్పి తీరాలి అని పట్టుపట్టారు.
ఏదీ దాచకూడదని పదేపదే హెచ్చరించారు.
ఇలా అడుగుతున్నారేమిటి బాబావారీ వేళ అని మన మండలి తల పట్టుకొన్నారు.
ప్రభువు ఆంతర్యం అర్థం కాలేదు.
అయితే వీళ్ళ ఆంతర్యం ప్రభువుకి తెలియకపోతే కదా.
అందుకనే చిరుదరహాసంతో మరో మాట శెలవిచ్చారు.
అకారణంగా వేయలేదీ ప్రశ్న అన్నారు.
ఓ విశిష్ఠమైన కారణం వుందన్నారు.
ఆ కారణమేమిటో చెప్పలేదు కానీ,
సిగ్గుపడకుండా మనలో మాటచెప్పండి అని మండలివారిని ఆదేశించారు.
"మనసు విప్పి మాట్లాడండి, చేసిన తప్పు పనయినా ఒప్పుకోండి నిర్భీతిగా",
అని అన్నారు. మండలివారి సంగతి మీకు తెలుసుగా పాఠక మహాశయా.
బాబావారు చెప్పినట్లు చేయడం వాళ్ళకి వెన్నతోపెట్టిన విద్య.
ఎందుకు, ఏమిటీ అని ప్రశ్నించరు.
ప్రభువు మాట సర్వదా శిరోధార్యం వాళ్ళకి.
ఎన్నో జన్మల తపఃఫలం వల్ల యుగావతారుని సాన్నిధ్యంలో వుంటున్న ఋషులు వీరందరూ.
అందుకనే, ఈవాళ కూడా, ఎప్పటిలానే ప్రభువు ఇచ్చు ప్రకారం నడుచుకొన్నారు.
నిర్మొహమాటంగా, నిర్భయంగా తమ బలహీనతలని, ఒక్కొక్కటీ ఒప్పుకొన్నారు.
అవతారుని సన్నిధి చేరక పూర్వం చేసిన తప్పుల్ని పూసగ్రుచ్చినట్లు చెప్పి చెంపలు

వేసుకొన్నారు. మళ్ళీ ఈ తప్పులు చేయమని ఒట్టువేసుకున్నారు.
బాబావారి దగ్గరకి వచ్చి, ప్రభువు మండలిలో చేరాక కూడా బుర్రకి వచ్చిన చెడ్డ ఆలోచనలన్నీ కూడా తడుముకోకుండా ఏకరువు పెట్టారు.
పొరపాటయింది మరలా ఇలా చేయమని ప్రతినపట్టారు.
బాబా మండలి వారు అందరూ తప్పుడు పనులు చేసినవారేనని అనుకోకండి.
కొంతమందే ఈ కోవకి చెందినవారు.
తప్పులు చేయని వాళ్ళు ఎందరో?
వాళ్ళ పేర్లు తెలుసా అని అడగకండి.
ఎందుకంటే అది చరిత్రకందని రహస్యం.
సరే ఇంతకీ మండలివారు తమ తప్పులు నిర్భీతిగా చెప్పేక,
పరంధాముడు ఏమన్నారో తెలుసా?
బహుశా మీరేకాదు అలనాటి మండలివారు కూడా ఊహించి ఉండకపోవచ్చు బాబావారి ఉవాచని. ఇంతకీ బాబావారు ఏమన్నారు అంటే,
'మీరేదీ దాచలేరు నాదగ్గర'.
కొంతమంది ఏ తప్పు చేయలేదు. వాళ్ళని తప్పించి,
మిగిలిన వాళ్ళు ప్రతి ఒక్కర్ని క్షమిస్తున్నాను అన్నారు.
ఈవాళ్టి నుంచి మీరు ఏదో తప్పు చేసామనుకుంటూ
పశ్చాతాప పడాల్సిన పనిలేదని స్పష్టం చేశారు.
ఏసు ప్రభువు కూడా శిష్యులని ఇలా అడిగేవారట రోజూ.
ఈవేళ ఏమన్నా తప్పులు చేసేరా అని. వాళ్ళు లెంపలువేసుకోవటం,
సరే మళ్ళీ చేయకండి అని కరుణామూర్తి క్షమించడం ఓ రివాజు
అప్పట్లో అని బాబావారు తెలియజేశారు.
రోజూ నిర్ధిష్ట సమయంలో ఏసు ప్రభువు శిష్యులని కలిసేవారు.
వాళ్ళ బలహీనతలని క్షమించేవాడు.
బుద్ధిగా బ్రతకండి అని హితవు పలికేవాడు అని బాబావారు మండలివారికి చెప్పారు.
క్రైస్తవుల్లో కాథలిక్కులకి ఈ క్షమాభిక్ష అలవాటు ఇప్పటికీ వుందన్నారు.
చర్చికి వెళ్ళి, ఫాధర్ దగ్గర తమ తప్పులు ఏకరుపెట్టి,
క్షమించమని ప్రభువుని ప్రార్ధిస్తారు వాళ్ళు.
ఇది మంచి పద్ధతేనన్నారు.
ఒకసారి లెంపలు వేసుకొని క్షమాభిక్ష పొందాక, మళ్ళీ తప్పులు చేయకూడదన్నారు.
క్షమాభిక్ష పొందాక కూడా తప్పుచేస్తే లాభం వుంటుందా అని సూటిగా ప్రశ్నించారు.
వారంలో ఏడు రోజులు మొత్తం ఏడు వందల తప్పులు చేసిన వ్యక్తి ఫాధర్ దగ్గర

లెంపలు వేసుకోవడం, మళ్ళీ బురదలో కాలు పెట్టడం మంచి పద్ధతి కాదన్నారు.
ఒక చెవితో విని రెండో చెవితో గాలిలోకి వదిలేస్తారు సువార్తని మానవులు.
అందుకనే పూజారి ఎన్ని మంచి విషయాలని ఎంత సోదాహరణంగా చెప్పినా దండగే అన్నారు. మంచి, చెడు ఎత్తి చూపించి,
సన్మార్గంలో పెట్టగల దిట్ట పూజారి కాదు, సద్గురువులు అన్నారు.
మనిషి చేసే నేరాలు, తప్పుల పర్యవసానం సద్గురువులు ఒక్కరికే తెలుసు.
తప్పుడు పనుల వల్ల వచ్చే అనర్థాలని ఎత్తి చూపించగలరు.
మనస్సు మార్చగలరు.
మంచి మార్గంలో పెట్టగలరు అని సద్గురువుల విశిష్టతని
బాబావారు మరోసారి విశదం చేశారు.
పూజారి మాటలు కేవలం మాటల మూట. అవి ప్రభావితం చేస్తాయా మనిషిని.
హిందువుల పూజారి అయినా, జొరాష్ట్రియన్ల పండితుడు దస్తూర్ గారయినా,
క్రైస్తవుల ప్రబోధకుడైనా సరే వాళ్ళు ఎన్ని మంచి విషయాలు ఎంత సోదాహరణంగా చెప్పినా, అది కేవలం పురాణ కాలక్షేపం తప్ప ఇంకేమీ కాదని స్పష్టం చేశారు.
ఈ మహానుభావుల ప్రవచనం చెవికి ఎక్కదని ఘంటా బజాయించి మరీ చెప్పారు.
ఇదే పూజారులకీ, సద్గురువులకీ తేడానన్నారు.
సద్గురువులు, కుతుబ్‌లు జ్ఞాన నిధులు.
వాళ్ళ ఉవాచ చెరగని ముద్రవేస్తుంది మనస్సుపైన.
మనిషిని ప్రభావితం చేస్తుంది అని పేర్కొన్నారు.
మరి మన మండలివారు ఇప్పుడు ఏం చేయాలి?
ఆ దిశానిర్దేశం కూడా బాబావారు స్వయంగా చేశారావాళ.
అప్రమత్తంగా వుండండి అన్నారు పశ్చాత్తాపం పడాల్సిన తప్పులు చేయకండి
అని హెచ్చరించారు. కామవాంఛకి దూరంగా వుండమని హితవు చెప్పారు.
ఎందరో ఋషులకీ, మునులకీ కామ ప్రకోపం వల్ల తపోభంగం కల్గింది అని గుర్తు చేశారు. గొప్ప తపోధనులే కామ లాలసకి బలి అయితే మీబోటి సామాన్యులు తుచ్ఛ కామవాంఛకి తట్టుకొని నిలబడగలరా అని సూటిగా ప్రశ్నించారు.
ఈ ప్రశ్న వింటూనే మండలివారి గుండె గుభేలు మంది.
అమ్మో! మా సంగతి ఏంకాను. మేము కూడా గతి తప్పుతామా?
మమ్మల్ని ప్రభువు కాపాడలేరా – ఇలా రకరకాల ఆలోచనలు చుట్టుముట్టాయి.
అయితే మీకే భయం అక్కర్లేదని ప్రభువు అభయం పలికారు.
మీకెందుకు చింత నేనుండగా చెంతనన్నారు.
మీరు ఎంతో పుణ్యం చేసుకున్నారు. అందుకనే నా సాన్నిహిత్యం దొరికింది మీకు.

మీ తప్పులని ఒప్పుకొన్నారు. క్షమాభిక్ష ననుగ్రహించాను.
ఇదంతా మీ అదృష్టమేనన్నారు.
తమ ప్రేమ పూరితమైన క్షమాభిక్షతో కరిగిపోయి వుండాలి మీ హృదయాలు అన్నారు.
మా తప్పులు విన్న బాబావారికి కోపం వచ్చిందేమోననుకోకండి.
నాకు కోపం రాలేదు, మీ తప్పులు వింటుంటే అన్నారు.
క్షమాభిక్ష ఎందుకు పెట్టిందీ వివరించారు.
మళ్ళీ తప్పులు చేయొద్దన్న షరతుపైనే మీ తప్పులు క్షమించానని స్పష్టం చేశారు.
క్షమించడం నా అలవాటు.
ఒక్కసారి నేను క్షమిస్తే, పశ్చాతాపపడాల్సిన తప్పు ఇహ వుండదు అన్నారు.
ఎంత అదృష్టవంతులో మీరు.
మీకివాళ లభించింది నా క్షమాభిక్ష అన్నారు.
ఒక్కసారి క్షమించాక ఏ పాపాలు వుండవు మీరు పశ్చాత్తాపపడటానికి అన్నారు.
కామవాంఛతో స్త్రీని తాకమని ప్రమాణం చేయమన్నారు.
మాలో కొంతమందికి పెళ్ళి అయింది కదా అంటే, పెళ్ళయినవారు భార్యని తప్ప మరో స్త్రీని తాకమని మాట ఇవ్వాలన్నారు.
బాబావారు చెప్పినట్లే చేశారు మండలివారు.
కామవాంఛకి దూరంగా వుంటామని దీక్షపట్టారు.
ప్రభువు సంతసించారు.
ప్రభువు క్షమించాను అని పదేపదే చెప్తున్నా మండలివారు పొంగిపోలేదు.
ప్రభువు దయతో క్షమించామన్నారు. కానీ మనం చేసింది తప్పేకదా!
తప్పు చేశాము కాబట్టే కదా తల దించుకొని నిలబడ్డాము.
ఎంత పొరపాటు పని చేశాము.
ఎందుకు రానిచ్చామీ కామ వాంఛని.
నోట్లో వేలు పెటితే కొరకలేనంత అమాయకులం కాదుకదా మనం.
కామవాంఛ ఎంత చెడ్డదో తెలియదా!
ఆధ్యాత్మిక మార్గంలో అడుగుపెట్టాక స్త్రీ వ్యామోహం తప్పు,
తగదు అని తెలియనంత మూర్ఖులం కాదు.
అయినా ఆ ప్రలోభాన్ని దగ్గరకి రానిచ్చాము. తప్పుచేశాము.
ఎంత పాపం మూటకట్టుకొన్నాము ఈ జన్మలో.
మెహెరావతారుని సేవించి, భగవదైక్యం పొందాలన్నది మన తపన.
కానీ కామ ప్రేరితమైన ఆలోచనలు,
కామం కోసం వెంపర్లాడటం ఆధ్యాత్మిక మార్గంలో ఎదురవుతాయనీ,

ఈ ప్రలోభాలు మాయ సృష్టించే పెద్ద అవరోధాలనీ తెలుసు.
ఈ బండ రాళ్ళని ప్రక్కకి త్రోసి ముందుకు వెళ్ళాలి.
ఇది ఎంత కష్టమయినా తప్పని సరి అని తెలుసు.
అయినప్పటికీ బురదలో కాలువేశాము.
ఏదో ఉదారభావంతో ప్రభువు క్షమించాను అన్నారు.
కానీ మనం క్షమార్హులమేనా?
మన పాపానికి నిష్కృతి వుంటుందా! అయ్యో!
ఎంత పొరపాటు చేశాము.
ఇలా పరిపరి విధాల మధనపడుతున్నారు మండలివారు.
అప్పుడు బాబావారు వాళ్ళకి కాస్తంత ధైర్యం నూరిపోశారు.
కర్తవ్యం బోధించారు. జరిగింది ఏదో జరిగిపోయింది.
మళ్ళా అలా పొరపాటు చేయకూడదు మీరు అన్నారు.
కామం చెడ్డది కాదు అన్నారు. కామ వాంఛ వుంటే వుండనీండి మీలో.
మీరు మాత్రం దానికి బలికాకండి అన్నారు.
అసలు ఈ కామం పేరు చెప్పికదా మీరు భూమిమీద పడ్డారు మనిషి జన్మనెత్తారు.
మరి ఈ కామం కారణంగానే ముక్తి దొరుకుతుంది.
దైవత్వం సిద్ధిస్తుంది మీకు అన్నారు.
ఆధ్యాత్మికంగా చెప్పాలంటే కామ వాంఛ అతి నికృష్టమైన బలహీనత.
కానీ ఆ వాంఛని తట్టుకొని నిలబడేవాడే అసలు సిసలు హీరో అని పేర్కొన్నారు.
భార్య కాని స్త్రీతో పొందు మహా ఘోర పాపాల్లో ఒకటన్నారు.
మీ స్ఫూర్తినీ, మీ శీలాన్ని నాశనం చేస్తుంది కామం.
మీ శరీరాన్ని రోగాల తుట్టు చేస్తుంది.
అయినా ఈ దుర్గంధపూరిత అవయవాలతో శాశ్వతానందం దొరుకుతుందా
అని ప్రశ్నించారు. తమ ఆదేశాలని పాటించమన్నారు.
కామానికి ఆమడ దూరంలో వుండమని స్పష్టం చేశారు.
జరగవల్సింది ఏదో జరిగింది. అది గతం.
ఇప్పటి నుంచీ విషయ వాంఛల పట్ల అప్రమత్తంగా వుండమన్నారు.
సర్వాంతర్యామికి తెలీనిది ఏమీ వుండదంటారు.
మరి మనం తప్పుచేయబోతుంటే ప్రభువుకి తెలుస్తుంది కదా!
ఆ సంగతి మన శ్రేయోభిలాషిగా ఏం చేయాలి – మనం తప్పుచేయకుండా ఆపాలి.
కానీ దేముడు ఎప్పుడూ అలా చేయడే! ఎందు వల్ల?
ఈ ప్రశ్నకి అడగకుండానే జవాబిచ్చారు బాబావారు ఆవాళ ఇరాన్ నగరంలో.

తమకి తెలియనిది అంటూ ఏదీ లేదన్నారు.
**నాకు ప్రతి ఒక్క విషయం, ప్రతి ఒక్క సంగతి తెలుసు.**
**అన్నీ తెలిసి కూడా అలా చూస్తూ వుంటాను అన్నారు.**
**నువ్వు తప్పు చేసేముందే నాకు తెలుసు నువ్వు తప్పుచేయబోతున్నావని.**
**కానీ ఆపను. అంటే, అన్నీ తెలిసి కూడా ఆ విషయంలో నేను కల్పించుకోను.**
**ఇది నా విశిష్టత. నా విశ్వకార్యక్రమపు ప్రత్యేకత.**
ఇదే నా రహస్యం అన్నారు. ఇంకో మాట శెలవిచ్చారు.
నీలో కామం వుండాలి.
కానీ ఆ వాంఛకి బలికాకుండా శాయశక్తుల ప్రయత్నించాలి నువ్వే!
ఇంకా చెప్పాలంటే కామంతో హోరాహోరీ పోరాడాలి.
వేలసార్లు ఓడిపోయినా సరే పట్టువదలకూడదు.
సమరానికి సై అంటూ లేచి నిలబడాలి అన్నారు.
నీలోని కామాన్ని తుడిచిపెట్టాలని అనుకొంటే చిటికెలో చెస్తానాపని.
కానీ అందువల్ల లాభం వుంటుందంటారా అని అడిగారు.
బాబావారేమిటి ఇలా అడుగుతున్నారని ఆశ్చర్యపడటం మండలివారి వంతు అయింది.
ఇది గమనించినట్లున్నారు.
బాబావారు తమ మాటకి తామే భాష్యం చెప్పారు.
సృష్టి రహస్యం వెల్లడించారు.
కామవాంఛని నేను తుడిచిపెడతాను చిట్ట చివరికి ఆ ఘడియవచ్చే వరకూ మీరు కామ శక్తితో ఢీ కొట్టాలి. ఇది తప్పనిసరి. ఇదే సృష్టి విచిత్రం.
ఇందువల్ల ఏమవుతుంది అంటే, కామాన్ని ఓడించడంలో తృప్తి, ఆనందం వుంటాయి.
విజయానికి కష్టపడాలి. కష్టం పడకపోతే పోరులో కూడా వుండరు.
ఎన్నోసార్లు ఓడిపోయాక సాధించే గెలుపులోనే వుంది నిజమైన ఆనందం.
అడ్డంకులు దాటకుండా, త్యాగాలు చేయకుండా,
అకుంఠిత దీక్షతో ప్రయత్నించకుండా సాధించే విజయాలు ఆనందాన్ని ఇవ్వవు.
కామంపై పోరాటం బ్రతికినంత కాలం తప్పదు.
కామ శక్తి వున్నది ఢీ కొట్టడానికే.
ఆఖరిరోజు వరకూ నిన్ను పట్టి కుదిపేసే సమస్య ఇది.
కామంతో పోరుకి రెడీగా వుండాలి ఎప్పుడూ.
కామాన్ని సంహరించడమే నీ ధ్యేయం.
అంటే అప్రమత్తంగా వుండాలి సర్వకాల సర్వావస్థల్లో అని బాబావారు శెలవిచ్చారు.
మెహెర్ ప్రభువు పట్ల ప్రేమ,

మెహెరునిపై నమ్మకం వున్న వ్యక్తి మెహెరుని మాటని పెడచెవిని పెట్టడు సరికదా,
రెండింతల అధిక శ్రమ పడి మరీ బాబా ఆదేశాన్ని పాటిస్తాడు.
ఈ సంగతి మండలివారికి తెలుసు.
మెహెరుని పరాత్పరుడిగా నమ్మివచ్చిన వాళ్ళకి మెహెరుని మాట శిరోధార్యం.
బాబావారికి తెలుసు ఈ సంగతి. అందుకనే కొన్ని మెళుకువులు చెప్పారు.
మనసా వాచా పాటించండి ఈ మెళుకువలు అన్నారు.
ఏ స్త్రీని తాకినా తమకి వెంటనే నివేదించమన్నారా సంగతి.
మీ సమస్యకి ఇదొక తరుణోపాయం అన్నారు.
ఇంకో తరుణోపాయం శెలవిచ్చారు. గత జన్మలో ఒక స్త్రీవి,
ఓ పురుషుడితో సంబంధం వుండేది అనుకో.
ఇప్పుడేమో పురుషుడిగా పుట్టావు.
స్త్రీ పొందు కోరుతున్నావు.
పోయిన జన్మల్లో చాలినంతగా తీర్చుకొన్నావు శారీరక వాంఛలని కదా.
మరింత కామంతో ఒరిగేది ఏముందిక అనుకొన్నావనుకో గట్టు ఎక్కువతావని చెప్పారు.
కామ వాంఛని వదుల్చుకోమన్నారు.
దుర్గుణాలన్నీ కామం వల్లనే కలుగుతున్నాయి కాబట్టి కామానికి దూరం కావటానికే
ప్రయత్నించు ప్రధానంగా అన్నారు.
కామాన్ని చిలుకతో పోల్చారు.
రెక్కలు విరిచేస్తే చిలుక చావదు సరికదా కొంతకాలానికి రెక్కలు మళ్ళీ వస్తాయి.
అదే పీక నొక్కేస్తే ఠపీమని చస్తుంది చిలుక.
అలానే కామవాంఛ బుర్రని తొలుస్తున్నంతసేపూ కోపం వంటి దుర్గుణాలని జయించి
లాభం లేదు. మేము ఎక్కడికీ పోలేదు అంటూ తిరిగి తల ఎగరేస్తాయి.
చిలుక పీకని నొక్కి చంపేసినట్లు, కామం తల నరికేస్తే, కామ శక్తి చచ్చిపోతుంది.
కామం వల్ల ఉత్పన్నమవుతున్న దుర్గుణాలన్నీ సమూలంగా నాశనమౌతాయి అని
శెలవిచ్చారు. పరిణామక్రమానికి కామ ప్రక్రియ అవసరమేనన్నారు.
వృక్షజాతి నుంచి మొదలవుతుంది ఈ వాంఛ అన్నారు.
కామ వాంఛ పెరగడంతో పరిణామ క్రమం ముందుకు కదుల్తుంది.
వాంఛ ఒక శక్తి. శక్తి పెరుగుతుంటే, చైతన్యావస్థ కూడా పెరుగుతుంది.
ఇవన్నీ ఆధ్యాత్మక మార్గంలోని సంగతులు.
అవగాహన కాదు మీకు ఎప్పటికీ.
ఇటువంటివే అనేక సంగతులున్నాయి ఆధ్యాత్మిక మార్గంలో.
ఒకటా రెండా వేలాది సంగతులున్నాయి.

సూక్ష్మాతి సూక్ష్మమైన సృష్టి రహస్యాలు అవి అన్నారు.
సన్నటి వెంట్రుకలో ఏముందో కళ్ళకి ఎలా కనబడదో,
ఈ సృష్టి మర్మాల వైనం అంతు చిక్కదు సామాన్యులకి అని బాబావారు పేర్కొన్నారు.
కాబట్టి మండలివారు, సాధకులు ఏం చేయాలి?
ఆ వైనం శెలవిచ్చారు.
ఎన్నోజన్మల్లో ప్రోగుచేసుకొన్న సంస్కారాలని తుడిచిపెట్టాలి.
ఇదేమీ ఆషామాషీ పని కాదన్నారు.
సంస్కారాలన్నింటిలోకీ గట్టి పిండం కామమేనన్నారు.
జిడ్డులా అతుక్కొని కదల నేను అనే
ఈ సంస్కారాన్ని వదిలించుకోవాలంటే ఏం చేయాలో చెప్పారు.
దూకు బరిలోకి ధైర్యంగా.
తలపడు హీరోగా. కామ శక్తిని ఓడిస్తావు అన్నారు.
కామ శక్తిపై పోరులోనే వుంది అసలు సిసలు ఆనందం.
దానికి తలవ్రొగ్గటంలో లేదు అన్నారు.
నాకు తెలిసీ పరమ రహస్యం.
అందుకనే ఈ మీ సంకుల సమరంలో నేను కలుగజేసుకోను అన్నారు.
అయినా సమయం రాగానే మీలోని కామాగ్నిని ధ్వంసం చేస్తాను.
అప్పటి దాకా మీవంతు పోరాటం మీరు చేయాలి.
పట్టువదల కూడదు అంటూ సాధకుడి విధిని నిర్దేశించారు.
మీ మానానికి మిమ్మల్ని వదిలేస్తానని భయపడకండి అంటూ అభయం పలికారు.

## కోఠి సెంటర్ వార్షికోత్సవం - గురు పూర్ణిమ ఉత్సవం

కోఠి సెంటర్ వార్షికోత్సవం – గురు పూర్ణిమ ఉత్సవం, 2015 జూలై 31న హైదరాబాద్‌లో కడు వైభవంగా జరిగింది. ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భజన గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, బాబా సందేశాలపై ప్రసంగాలు, అన్నింటికంటే మిన్నగా సా. 4 నుండి రెండు గంటలపాటు అవతారుని ఏకనామ స్మరణ జరిగాయి. బాబా ప్రేమికులు శ్రీ యం.వి.ఆర్.కె. బాలాజీ కార్యక్రమాన్ని నిర్వహించగా, శ్రీ తోట నాగేశ్వరరావు, **'అవతారుని పట్ల విధేయత'** అనే అంశంపై ప్రసంగించారు. జబల్‌పూర్ బాబా ప్రేమికుడైన అమియకుమార్ హజ్ర బాబా పరిధిలోకి వచ్చిన వైనంపై యువ బాబా ప్రేమికులు లఘు నాటిక ప్రదర్శన చేశారు. కాగా, ఈ సంచికలో, అమియకుమార్ హజ్ర గురించి శ్రీ విఆర్‌కె శాస్త్రి రాసిన ప్రత్యేక వ్యాసాన్ని దయచేసి పరిశీలించగలరు!!

# ఆలీ షా

## (శ్రీ తాడిమేటి అక్బర్ కృష్ణ, తాపేశ్వరం)



ఆలీషా అయిదవ భూమికలో వున్న జమాలీ మస్తు. బాబాతో సన్నిహిత సంబంధము కలిగిన ఈ మస్తు చరిత్ర ఆనందం కలిస్తుంది. ఇతనికి సిగరెట్లంటే మహాప్రీతి. శాంత స్వభావుడు. ఎంతో విధేయుడుగా ఉంటాడు. చిన్నబిడ్డలా అమాయకత్వంతో ఉంటాడు. ఇది అతని సహజ లక్షణం. బాబా అతనిలోని ఈ సద్గుణాన్ని చూసి ఇది అతని అంతరంగ సౌమ్యతకు బాహ్య చిహ్నమని చెప్పేవారు. ఆలీషా మరొక మస్తుతో కలసి చాలా సంవత్సరాల క్రితమే అహ్మద్‌నగర్ వచ్చాడు. కొన్నాళ్ళకు ఆ రెండవ మస్తు వెళ్ళిపోయాడు. తరువాత మళ్ళీ అహ్మద్‌నగర్‌లో కనిపించ లేదు. మొదట్లో ఎక్కడో మూలకూర్చుండే ఆలీషా తరువాత స్థానిక ధర్మశాల మధ్యస్థలం ఆక్రమించాడు.

కొన్ని నెలల తరువాత ప్రజలు అతనిని గౌరవింపసాగారు.

కొందరు గృహస్థులు అతనికి తిండిపెట్టేవారు.

మరికొందరు ఇష్టమైన వారు వాని ఎదుట పాటలుపాడి ఆనందించేవారు.

మరికొందరు అతనికి కావలసిన వస్తువులు సమకూర్చేవారు.

తరువాత కాలంలో ధర్మశాలకు ఎదురుగా ఉండే మైదానంలో నిలిచే బస్సు డ్రైవర్లకు ఇతను ప్రీతిపాత్రుడయ్యాడు. వారు ఇతడిని గౌరవంగా చూసేవారు.

ఆ రోజుల్లో బస్సులు నడపడం లాభసాటి వ్యాపారం.

భారత దేశంలోని బస్సు డ్రైవర్లు, కండక్టర్లు మొరటుగా వుండేవారు.

మరి వాళ్ళ డ్యూటీలు అలా ఉండేవి.

విధి నిర్వహణలో ఒకరోజున్న చోట మరో రోజు ఉండేవారు కాదు.

వారి నైతిక ప్రవర్తన సందేహాస్పదంగా ఉన్నా వారి హృదయాలు మాత్రం మంచివి. వారు స్వతహాగా ఎలాంటి వారైనా మహాత్ములు, సాధువులు అంటే సహృదయంతో జాలి కలిగి ఉండేవారు. అటువంటి వారు ఆలీషాని గౌరవించేవారు.

పూర్వం పాపులుగా పరిగణింపబడినవారే ఏసుక్రీస్తుకి అండగా నిలిచారు.

పురోహితులు పూజారులు ఆయనను శిలువ వేయడానికి కుట్రపన్నారు.
ఆలీషా మంచివాడు, శాంత పురుషుడు, నెమ్మదస్తుడైన ఆలీషా గురించి ఎక్కువగా ఏమీ చెప్పలేను. ఆలీషా రోజంతా ఒక గదిలో వీలైతే ఒక కుర్చీలో కూర్చొని సిగరెట్లు కాల్చడానికి ఇష్టపడేవాడు. నేలమీద, ఒంటిమీద ఏవేవో గుర్తులు పెట్టుకుంటూ ఉత్తరాలు రాస్తున్నట్లుగా గాలిలో చేతివ్రేళ్ళు కదిలిస్తుండేవాడు.
తనలో తను గొణుగుతూ ఉండేవాడు. ఎవరైనా ఏదైనా ప్రశ్నిస్తే కాసేపలా చూసి దానికి జవాబు అక్కరలేనట్లు ఆ ప్రశ్నే తాను అడిగి ప్రశ్నించిన వానికి చిరాకు తెప్పించేవాడు. అతని కంఠస్వరము నెమ్మదిగా, మృదువుగా వుండి, చిరునవ్వుతో ఉండేది. సాధారణ మనుషులు అతని మాటలకర్థము గ్రహించలేరు.
ఒకే మాట రకరకాలుగా పలికేవాడు. అతని కిష్టమైన క్రియాపదం బోల్నా (మాట్లాడుట). ఆ మాటనే అతను “బోల్తాథా, బోల్నేకోలగా, బోలావూకే... అంటుండేవాడు. దీనర్థం అతనికే తెలియాలి. ఓ సారి మహాబళేశ్వర్‌లో బాబా కెదురుగా నిలబడి ఇలా అనడం నాకు జ్ఞాపకం ఉంది. ‘బోలేంగే, బోలేంగే, లేకిన్ కబ్ బోలేంగే మాలూమ్ నహీ” (ఆయన మాట్లాడుతాడు, మాట్లాడుతాడు, కాని ఎప్పుడు మాట్లాడుతాడో తెలీదు). బహుశా బాబా మౌన విరమణను గురించి ఈ మాటలు అన్నాడేమో!
మస్తుల మాటలకు అర్థం చెప్పడం కష్టం. మనం ఎలానైనా అనుకోవచ్చు.
బాబా మస్తులతో తాను చేసే కార్యక్రమం గురించి వివరాలు ఎప్పుడూ చెప్పలేదు.
ఆలీషాను తరచు ఎందుకు పిలిపించుకునేవారో చెప్పడం కష్టం.
ఆలీషాను తన మంచి సహాయకారిగా మాత్రం బాబా భావించారని మాత్రమే తెలుసు. 1943లో మొదటిసారి కలుసుకున్నది లగాయితు 1947 జూలై ఆఖరి వరకు వేరువేరు సమయాల్లో బాబా ఆలీషాను పిలిపించుకున్నారు.
ఒకసారి బాబా ఆలీషాతో ఏకాంతంగా గడిపిన తరువాత చాలా అలసినట్లు కన్పించారు. బాబాను అడిగితే ఆలీషా నిద్రమత్తులో జోగుతూ బద్ధకంగా ఉన్నందువలన తాను అధికశ్రమ పడవలసి వచ్చిందని చెప్పిన విషయం నాకు జ్ఞాపకం ఉంది.
ఆలీషా సాధువు. పైగా అల్ప సంతోషి. ఆయన పనులు చక్కగా నెరవేరాలంటే ముందుగా మస్తుని సంతోషపెట్టాలని బాబా చెబుతుండేవారు.
బాబాతో ఆధ్యాత్మిక కార్యక్రమం చేయడానికి ఆలీషా ఎప్పుడూ సిద్ధంగా ఉన్నట్లనిపించేది. ఆలీషా అధికంగా బాబా శిష్యులువుండే అహ్మద్‌నగర్‌లోనే ఉండేవాడు.
అందుచేత సులభంగా దొరికేవాడు. బాబా పిలవగానే, ఏ అడ్డంకులు చెప్పకుండా వచ్చేవాడు. ప్రశాంతంగా వుండే గదిలో కావలసినన్ని సిగరెట్లు ఉంటే ఎక్కడైనా అతడు వుండగలిగేవాడు. బాబాతో ఆలీషా ఏకాంతంగా ఇరవై సందర్భాలలో వున్నా, వాటిలో ఒకటి మాత్రం ముచ్చటగా ఉంది.

అప్పట్లో బాబా మధ్యప్రదేశ్‌లోని అంగీరస ఋషి కొండమీద ఏకాంతవాసం చేస్తున్నారు. ఈ కొండ రాయపూర్‌కి వందమైళ్ళ దూరంలో క్రూరమృగాలతో నిండివున్న అరణ్యంలో వుంది. వారి ఆశ్రమము పవిత్రమైన మహానది పుట్టిన చోటుకి సమీపంగానే ఉండేది. జలజలా ప్రవహించే సెలయేళ్ళతో, పచ్చని వనాలతో, మనోహరమైన కొండ ప్రదేశంలో ఉండింది. పూర్వకాలంలో నిర్మానుష్యమైన ఈ అడవిలో నలుగురు ఋషులు – అంగీరసుడు, శృంగి, ముకుందుడు, కుమగుడు ఆశ్రమాలు ఏర్పరచుకుని నివసించేవారని ఆ చుట్టుప్రక్కల గ్రామస్తులు ఇప్పటికీ చెనబుతుంటారు. బాబా తన ఏకాంతవాసం చేయడానికి అనువైన ప్రదేశం చూడమని తన శిష్యుడు జాల్ కేరావాలాని కోరినప్పుడు అతడు అంగీరస ఋషి వుండిన ఈ కొండమీద ఒక కుటీరాన్ని నిర్మించాడు. కారు పోవడానికి దారి చేయించాడు. వారికి కావలసిన నీరు, పాలు, కూరగాయలు తేవడానికి మనుషులను నియమించి చక్కని ఏర్పాట్లు చేసాడు.

1945వ సంవత్సరము అక్టోబరు 31న బాబా తన శిష్యపరివారముతో ఈ కొండమీద బస చేయడానికి వచ్చారు. ఆలీషా కోసం కొండ చివర కొంచెం దిగువగా కుటీరం ఏర్పాటు చేసారు. అందులో నాలుగు రోజులు ఆలీషాతో బాబా ఏకాంతవాసం చేసారు. తరువాత ఆలీషాను అహ్మదునగర్ పంపించి వేసారు.

తరువాత ఆఖరి వారంలో తన కోసం నిర్మించిన ప్రత్యేక కుటీరంలో తన మౌన కార్యక్రమాన్ని కొనసాగించారు. ఆ రోజుల్లో ఏకాంతంగా కొన్ని గంటలు గడపిన తరువాత బాబా బయటకు వచ్చినప్పుడు చాలా నీరసంగా అలసి పీక్కుపోయినట్లు అనిపించింది. బాబా ముఖం ఈ విధంగా పీక్కుపోయి ఉన్నట్లు తాను ఎప్పుడూ చూడలేదని అదీ చెప్పాడు. బయటకు వచ్చిన బాబా ప్రపంచానికి బ్రహ్మాండమైన విపత్తు రాబోతోందని, మూడువంతులు మానవ జాతి నశిస్తుందని చెప్పారు.

అది విని ఆదీ చాలా ఆందోళన పడ్డాడు. ప్రపంచానికి సంభవించే విపత్తు నుంచి రక్షించడానికే బాబా ఏకాంతవాసంలో కార్యక్రమము నడిపి ఉంటారని ఆదీ అనుకున్నాడు. మరొక అసాధారణమైన సంఘటన.

బాబా పూణేకు 40 మైళ్ళ దూరంలో వున్న పురందర్‌లోని శివాజీ మహారాజ్ కోటలో ఆలీషాతో ఏకాంతవాసం చేసినప్పుడు జరిగింది.

పురందర్ కోట శిఖరము సముద్ర మట్టానికి 4500 అడుగుల ఎత్తులో పురందర్, వజీర్‌బాగ్ అనే రెండు కొండల మధ్య వుంది. 1947 మార్చిలో శివాజీకి సంబంధించిన ప్రదేశంలో ఏకాంతవాసం చేయడానికి బాబా సంకల్పించారు. అందులో పురందర్ కోట అందుకు యోగ్యమైనదిగా భావించారు. తగిన ఏర్పాట్లు చేసాక అహ్మద్‌నగర్ నుండి ఆలీషాను తీసుకువచ్చారు. అక్కడ ఆలీషా బాబాతో ఎనిమిది రోజులు వున్నాడు. అది ఏప్రిల్ నెల, ఎండాకాలం. అయితే ఏ దేవతల ఆగ్రహమో అన్నట్లు అరేబియా

సముద్రంలో భయంకరమైన తుఫాను చెలరేగింది. దాని ప్రభావంచేత పడమర తీరంలో వున్న పురందర్‌కోట తుఫానులో చిక్కుకుంది. కోట శిఖరం పొగమంచుతో కప్పబడిపోయింది. నీటి కాలువలన్నీ బురదమయమయ్యాయి. ఎనిమిది రోజుల తరువాత ఆలీషాను తీసుకొని సతారా వెళ్ళి శిధిలమై వున్న అజింక్యతార కోటలో ఒక రోజంతా ఏకాంతవాసం చేసారు. పురందర్‌లాగే సతారా కూడా శివాజీ మహరాజ్‌తో సంబంధపడివుంది. సతారాకి ఎనిమిది మైళ్ళ దూరంలో వున్న సజ్జన్‌గఢ్‌లో శివాజీ మహరాజుగారి ఆధ్యాత్మిక గురువు సమర్ధ రామదాసుస్వామి వారు సమాధిచెందారు. ఆలీషా బాబా ఏకాంతవాసం చేసిన ఇరవై సందర్భాలలో ఈపైన తెలిపిన రెండు ముఖ్యమైనవి. ఈ గ్రంధ రచనా కాలంలో (సెప్టెంబరు 1947) బాబా ఆదేశంపై ఆలీషాకు మెహెరాబాద్‌లో నివాసం ఏర్పాటు చేసారు. రానురాను ఆలీషా సాధారణ మనిషిగా మసలుకోవడం ప్రారంభించాడు. అయినా ఇదివరకటివలెనే 'బోల్నా' అనే క్రియాపదాన్ని వివిధ రీతులలో వింతగా పలుకుతూనే ఉన్నాడు. స్పష్టంగా, సందర్భానుసారంగా మాట్లాడటంవంటి మంచి మార్పులు వచ్చాయి. అతని గదిలో చాలా ప్రశాంతగా లోపల మనిషి ఉన్నాడా లేదా అనే సందేహం వచ్చేటట్లు ఉంటున్నాడు. ఈ విషయంలో మహ్మదు మస్తుకీ, ఆలీషాకి ఎక్కడా పోలికలేదు. మహ్మదు మస్తు ఉదయం నుంచి చీకటిపడే దాకా తెలిసీ తెలియకుండా లొడలొడా వాగుతుంటాడు. అదిగో మహ్మదు అక్కడ ఉన్నాడని అందరికీ తెలిసేది. బాబా తన కార్యక్రమం సాగించిన ఇద్దరు గొప్ప మస్తులు మహ్మదు, ఆలీషాలు అప్పట్లో మెహెరాబాదులో వుండి దైనందిన కార్యక్రమాల్లో పాల్గొని బాబా సహాయంతోను. ప్రేమతోను ప్రేరణ పొందారు. *

---

* ఇటీవల ముంబాయి బాబా సెంటర్ ప్రేమికులు **మెహెర్‌బాబా మెచ్చిన ఐదుగురు మస్తులు (THE FIVE FAVOURITES OF AVATAR MEHER BABA) పేరిట** ఒక చిన్న సంకలనాన్ని ఇంగ్లీషులో ప్రచురించారు. ప్రస్తుతం గత మూడునాల్గు నెలలుగా ఈ ఐద్గురు మస్తుల పుస్తకంలోని నల్గురు మస్తుల గురించి మెహెర్‌బాబా పాఠకులకు తగిన సమాచారం అందిస్తున్నాం. **చివరిగా,** సెప్టెంబరు సంచికలో ఐదవవాడైన **చాచా మస్తు** గురించి ఆసక్తికర విషయాలను ప్రచురించనున్నాం!! దయచేసి పరిశీలించగలరు. **THE WAYFARERS,** బాటసారులు భగవదున్మత్తులతో మెహెర్‌బాబా, **(Meher Baba with the God Intoxicated)** పాశ్చాత్య బాబా ప్రేమికుడైన విలియం డాన్‌కిన్ ఇంగ్లీషులో బాబా అనుమతితో రాసి, ప్రచురించిన సంగతి పాఠకులకు తెలుసు. కాగా, ఈ ఆంగ్ల గ్రంధాన్ని **శ్రీ తాడిమేటి అక్బర్ కృష్ణ, తాపేశ్వరం - 533340, తూ.గో.జి.** తెలుగులో అనువదించి ప్రచురించారు.

***

# మౌన వార్షికోత్సవము

## విశాఖపట్నం

విశాఖపట్నంలో అవతారుని మౌన వార్షికోత్సవం సందర్భంగా జూలై 9, 10, తేదీలలో ఘనంగా జరిపినట్లు శ్రీ టి. ఏ. నారాయణ, కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 19న బాబావారి ప్రవచనం 'దివ్య ప్రేమ', జూలై 26న మానవాళి అనుభవిస్తున్న బాధ అనే అంశాలపై గోష్ఠి నిర్వహించినట్లు శ్రీ నారాయణ తెలిపారు.

## చోడవరం

అవతార్ మెహెర్ బాబా చోడవరం సెంటర్‌లో బాబాప్రేమికులు సుమారు 30 మంది 09.07.2015 రాత్రి 12 గం.ల నుండి 10.07.2015 రాత్రి 12 గం.ల వరకు 24 గంటలు "మౌనం" లో పాల్గొన్నారని, శ్రీ ఈ. నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు.

## విజయనగరం

10.07.2015 న 90వ మౌన వార్షికోత్సవములో భాగంగా అవతార్ మెహెర్‌బాబా విజయనగరం కేంద్రములో, శ్రీ వడ్డాది గోపాలరావు గారి ఆధ్వర్యంలో సుమారు 20 మంది మౌనం పాటించిరి. మరియు శ్రీ కొల్లి రామారావుగారు, శ్రీ పి. రాజేశ్వరరావు గారి ఆధ్వర్యంలో సుమారు 83 మంది, మెహెరాబాద్‌లో 90వ మౌన వార్షికోత్సవములో పాల్గొనిరి. పై విషయం శ్రీ కె.వి. రమణమూర్తి, కార్యదర్శి తెలియజేయడమైనది. ఆగష్టు 15న ఉ. 7 నుండి సా. 7 వరకు ఏకాహం నిర్వహించడమైనది.

## ఖైరమంగళ

ఖైరమంగళలో అవతారుని మౌన వార్షికోత్సవం జూలై 9, 10, 11 తేదీలలో ఘనంగా జరిపినట్లు శ్రీ కె. సుబ్రహ్మణ్యం, అధ్యక్షులు ఒక ప్రకటనలో తెలిపారు.

## పావగడ

పావగడలో జూలై 10 నాడు మౌన వార్షికోత్సవం ఘనంగా జరిపినట్లు కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. 2015 జూలై 18, 19 తేదీలలో పావగడకు సమీపంలోని రాళ్ళపల్లి గ్రామంలో రెండ్రోజుల సహవాస్ నిర్వహిస్తున్నట్లు ఆయన అన్నారు. ప్రతి నెలా 4వ ఆదివారం ఉ. 5 నుండి రాత్రి 9 దాకా ప్రేమిక సత్సంగ్ పావగడలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# అవతార్ మెహెర్‌బాబా యెడల విశ్వాసము

**(శ్రీ వి.ఆర్.కె. శాస్త్రి)**

"మానవాళి మధ్య సదా కనుమరుగవుతు, మరల కనుగొనబడుతూ ఉండేవాడిని నేనే. నేను ఆ పురాణ పురుషుడను" "నేను రాముడను, కృష్ణుడను, గతావతారములన్నీ నేనే. ఇప్పుడు మెహెర్‌బాబాగా వచ్చాను." – **అవతార్ మెహెర్‌బాబా.**

గతావతారములలో ఎన్నడులేని విధంగా ఈ మెహెర్ అవతారములో మెహెర్‌బాబా తాను అవతారుడినని ప్రకటించారు. మానవ మేధస్సుతో కూడిన తర్క వితర్కాలతో అవతారుడిని నమ్మి, విశ్వసించడం అసాధ్యం. మెహెర్‌బాబా సెక్రటరి, ఆది.కె. ఇరాని మాటల్లో: 'మెహెర్‌బాబా (మేర్వాన్) షిర్డిలో సాయిబాబాను కలిసినప్పుడు 'పర్వర్దిగార్' అని మెహెర్‌బాబాను సాయిబాబా సంబోధించినప్పుడు ప్రత్యక్ష సాక్షిగా వున్న గుస్తాద్‌జీ చెప్పగ, తల్లి తన సంతానానికి ఇతడే మీ తండ్రి అని చెపితే వారు విశ్వసించినట్లుగ, బాబా అధికార పూర్వకంగా తాను అవతారుడినని నొక్కివక్కాణించగ నేను మెహెర్‌బాబాను అవతారుడిగ విశ్వసించాను. భగవంతుడు తన భక్తుల యొక్క భక్తిని పరిశీలించుటకు అనేక పరీక్షలు పెడతాడు. అదే పరంపరను కొనసాగిస్తూ ఈ యుగావతారుడు మెహెర్‌బాబా తన ప్రేమికుల ప్రేమ, విధేయతలకు అనేక పరీక్షలు పెట్టాడు. ఇంకా ఆ ప్రక్రియ నిరంతరాయంగా జరుగుతూనే వుంది. ఒక ప్రేమికుడు తనకు బాబా యెడల సంపూర్ణ విశ్వాసం కలుగుటకు బాబాను హృదయపూర్వకంగా ఏదైనా నిదర్శనం కాని, అనుభవం కాని కోరుకుని వేడుకుంటే, అతడి కోరిక నెరవేరి, బాబాను సంపూర్ణంగా విశ్వసించి, బాబా ప్రేమను పొందిన సంఘటనలు కొకొల్లలు. ఆ అవకాశం అలా కోరుకునే తన ప్రేమికుడికి ప్రియతమ మెహెర్‌బాబా ఒకే ఒక్కసారి కలుగచేస్తాడు. ఈ క్రింది ఉదంతం మాత్రం దీనికి పూర్తి విరుద్ధం, భిన్నం అయినది. ఇది జబల్‌పూర్‌కు చెందిన ప్రొఫెసర్ అమియకుమార్ హజ్రకు సంబంధించినది. ఇతడు ఎన్నో పుస్తకాలు చదివి జ్ఞానసంపన్నుడయ్యాడు. మతం, వేదాంతం శుద్ధ బూటకమని ఇతడి అభిప్రాయం. ప్రతిది విమర్శనాత్మక దృష్టితో చూసేవాడు. ప్రతిదానికి విజ్ఞాన శాస్త్ర రీత్య రుజువు కావాలనేవాడు. అటువంటి అమియకుమార్, ఒకసారి భావూకల్చూరి మెహెర్‌బాబా గురించి ఒక సమావేశంలో చెబుతుండగా విని, సమావేశం ముగిసిన పిదప భావూని బాబా చెప్పిన విషయముల గురించి ప్రశ్నించాడు. 'నీవు ప్రస్తుతం చేస్తున్న యమ్.ఏ. డిగ్రీ పూర్తయ్యాక ఈ విషయముల గురించి నీకు ముందు ముందు అర్థమవుతుంది అని భావూ బదులిచ్చాడు. ఇతడు పుస్తకాల పురుగని తెలిసిన స్నేహితుడొకడు ఇతడికి మెహెర్‌బాబా పుస్తకాలు ఇవ్వగ, ఒక పుస్తకం మీద వున్న బాబా చిత్రం చూసి ఆకర్షితుడై,

ఆ పుస్తకాలన్నిటిని చదివేస్తాడు. జాతి, కుల, మతముల కతీతంగా, చిన్న, పెద్ద, పేద, గొప్ప అను బేధాల్లేకుండా సర్వజనామోదం పొందిన మెహెర్‌బాబా ఎవరో తెలుసుకోవాలనే కుతూహలంతో, బాబాతో అనేక ప్రశ్నలు, సందేహాలతో కూడిన ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతాడు. బాబా తాను అవతారుడినని చెపుతున్నాడు, నిజంగా అవతారుడైతే నేను పెట్టే పరీక్షలలో బాబా నెగ్గాలి అని అనుకుంటాడు. తల్లి బజారుకు పోయి నిమ్మకాయలు తెమ్మంటే, నేను ఇల్లు కదలకుండా నిమ్మకాయలు రావాలి, మండుటెండలో బజారుకు వెళుతున్నప్పుడు దాహంవేస్తే, ఇప్పటికిప్పుడు ఎవరైనా పటిక బెల్లం పెట్టాలి. ఇలా ఎన్నెన్నో పరీక్షలు బాబాకు పెట్టగా, బాబా అతను కోరినట్లుగానే అన్నీ నెరవేరుస్తూ,. ఆవిధంగానే అనుభవాలనిచ్చాడు. తీరా అన్నీ జరిగాక, అనుమానాల పుట్ట అయిన అమియా అవన్నీ ఏదో కాకతాళీయముగా జరిగినవేనని తీసిపారేసేవాడు. అప్పటికే మెహెర్‌బాబా సాహిత్యాన్నంతా క్షుణ్ణంగా చదివిన అమియ ఇలా అనుకున్నాడు. 'నేను పూర్తి చైతన్య స్థితిలో వుండగా ఒక్క క్షణమైన ఏదో ఒక భూమిక అనుభవం కలగాలి. అప్పుడు ఆ అనుభవం ఈ విశ్వానికి సంబంధించిన క్రీడలో మూడవ వ్యక్తి యొక్క ప్రమేయం ఏమాత్రం లేనిదై, బాబా ఎడల సంపూర్ణ విశ్వాసం కలిగిస్తుంది. అలా అనుకున్న రోజున అంతా మామూలుగానే గడిచింది. అమియా ఆ రోజు రాత్రి మంచంపై జారగిల బడి ఒక పుస్తకం చదువుకుంటూ ఉండగా, ఏదో వివరించి చెప్పలేని అసాధారణ సంఘటన జరగడం ప్రారంభమైనట్లనిపించి, స్పష్టత కోసం గదిలో లైటు కూడా ఆర్పేశాడు. అప్పుడు సమయం పది గంటలు కావస్తోంది. అతడు అర్ధరాత్రి సమయంకాని నిద్రించేవాడు కాదు కావున పూర్తి మెళుకువ స్థితిలోనే వున్నాడు. తెల్లటి వెలుగు మిణుకు మిణుకు మంటు ఆ గదంతా పరుచుకుని, ఆ కాంతి క్రమంగా ప్రకాశవంతమవుతోంది. అంతకు ముందెప్పుడూ అలా జరుగలేదు కనుక అమియ చాలా భయపడిపోయాడు. అప్పుడు అకస్మాత్తుగా తను బాబాను సూక్ష్మ భూమికల అనుభవం కలుగచెయ్యమని కోరినట్లు గుర్తుకొచ్చింది. పక్కమీద పడుకుని వున్న అమియ లేచి కూర్చుని, మానసికంగా కొన్ని గుణకార భాగారాలు చేసుకుని, తాను పూర్తి మెళుకువ స్థితిలోనే వున్నట్లుగా నిర్ధారించుకున్నాడు. అప్పుడే లైటులేని ఆ చీకటి గదిలో గొప్ప కాంతివంతమైన రంగులతో కూడిన వెలుగులు కనిపించాయి. అమియ కళ్ళు మూసుకున్నా, కళ్ళకు మఫ్లర్ చుట్టుకున్నా ఆ కాంతి అలాగే కనిపిస్తోంది. అతడు ఆ వింత గొలుపుతున్న దివ్యకాంతులను చూడకూడదని ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఆ కాంతులు సుమారు అర్ధగంట సేపు అలాగే వుండి, ఒక్కసారిగా ప్రమాదాన్ని సూచిస్తున్నట్లు మిక్కిలి తేజోవంతమైన బంగారు కాంతి వలయంగా కనిపించి, ఆ వలయం అపరిమితమైన భయం గొల్పుతు అమియ వైపు చాలా వేగంగా రావడంతో, అకస్మాత్తుగా తనను తన ఇల్లు, భూమి, మనుషుల నుండి దూరంగా ఎంతో దూరంగా బలవంతముగ లాక్కుని తీసుకుపోతున్న అనుభవం

అమియకు కలిగింది. తను ఎక్కడకు వెళుతున్నాడో తెలియకపోయినా, తన ఇంటికి కాని, ఈ భూమ్మీదకు కాని తిరిగి రాలేనేమో అని బెంగ కలిగేంత దూరం వెళ్ళిపోయాడు. ఇదే ఇంక పరాకాష్ట అన్నట్లుగా అమియ పెద్ద తిరుగుబాటు ధోరణిలో గట్టిగా అరిచాడు. అమియకు తన ప్రియమైన వారి నుండి తనకు అంతు తెలియనంత దూరం తీసుకుపోవడం ఎంతో భయం కలిగించింది. మంచం మీద నుండి క్రిందకు ఉరికి, విపరీతమైన భయంతో పరుగెత్తుకుంటూ, ప్రక్క గదులలో బాధావ్యధలతో నిండిన తన పరిస్థితుల ఎరుకలేకుండ ప్రశాంతంగా నిద్రిస్తున్న తన బంధువులను దాటి, ఈ భౌతిక ప్రపంచంతో తన సంబంధం పూర్తిగా తెగిపోవునని హెచ్చరించిన ఆ అనుభవం నుండి ఎలాగైన తప్పించుకొనుటకు తన ఇంటి ఆరుబయటకు వచ్చాడు. అప్పుడు అమియ, మెహెర్‌బాబాను పరీక్షించినందుకు క్షమించమని, తనను సుదూర ప్రాంతమునకు పంపకుండా తన కుటుంబంతో వుండనీయమని బాబాను ప్రార్ధించడంతో, ఆ అనుభవం క్రమంగా క్షీణించి, కొద్ది నిముషములలో తన చైతన్యం ఇతర భూమికలతో సంబంధం లేకుండా తిరిగి ఈ భౌతిక ప్రపంచ చైతన్యంలోకి వచ్చింది. అమియ హృదయపూర్వకంగా మెహెర్‌బాబాకు కృతజ్ఞతలు తెలుపుకుని, తన గదిలోనికి పోయి విశ్రాంతిగా నిద్రించాడు. అతడు మరుసటి రోజు నిద్ర నుండి లేచి, ముందు రోజు రాత్రి జరిగిన అనుభవములను తలుచుకుని తన పాత అలవాటు ప్రకారం ఆ అనుభవములన్నీ కేవలం తన భ్రమ మాత్రమే అను నిర్ణయానికి వచ్చాడు.

అయినప్పటికీ అన్నింటికీ అతీతుడు, దయామయుడు, ప్రేమ మహాసాగరుడు అయిన అవతార్ మెహెర్‌బాబా తన ప్రేమ వలయంలోనికి అమియకుమార్ హజ్రను లాక్కొని, తన కృపాకటాక్షంతో అతడికి బాబా అవతారుడను ప్రగాఢ విశ్వాసం కలిగించారు. అమియకుమార్ బాబాకు ఎన్నెన్ని పరీక్షలు పెట్టినప్పటికి, అతడు తన పూర్వజన్మ సుకృతంచే, తర్క వితర్కాలకతీతమైన అవతార్ మెహెర్‌బాబా సత్యప్రేమ సామ్రాజ్య పరిధిలోనికి వచ్చి తీరాలి కనుక బాబా అతడికి అన్ని అవకాశాలు ఇచ్చారేమో అనిపిస్తుంది. లేకుంటే ఇంతటి మహద్భాగ్యము నూటికో, కోటికో కూడా ఎవ్వరికి లభించదు. బాబా అన్నారు కదా.. "నేను అవతారుడినని తెలుసుకొనగలిగిన నీవు ఎంతటి భాగ్యశాలివో నీకు ఎప్పటికి తెలియదు." మరి మెహెర్ బాబాను అవతారుడని తెలుసుకుని, బాబా కొంగును వీడకుండా పట్టుకోవడం ఇంకెంతటి మహద్భాగ్యం? మరి తుదిశ్వాస వరకు బాబా కొంగును వీడకుండ, బాబాయందు సంపూర్ణ విశ్వాసం, పరిపూర్ణ విధేయతతో జీవించగలిగితే అది ఇంకెంతటి భాగ్యాతి భాగ్యం?

ఈ ప్రశ్నలకు జవాబు ఎవరిది వారిదే.

***

# గుర్తుంచుకోండి!!

మనకు తెలిసిన వారు మరణించినప్పుడు వారిని చూడ్డానికి వెళ్తుంటాం.
అలా వెళ్ళినప్పుడు ఆ చనిపోయిన వ్యక్తిని తాకవద్దు అని మెహెర్‌బాబా హెచ్చరించారు.
ఎందుకంటే, ఆ సమయంలో చనిపోయిన వ్యక్తి నుండి అనేక వేల సంఖ్యలో సంస్కారాలు ఆతని దేహం నుండి బయటకువస్తాయి.
అందుకనే పార్శీలు ఏం చేస్తారంటే చనిపోయిన వ్యక్తి పార్థివ శరీరం మొత్తానికి పెరుగును ఒక పూతలా రాసి ఒక కుక్కను తీసుకొస్తారు. ఆ కుక్క ఆ పెరుగునంతటినీ నాకుతుంది.
ఆ మాదిరిగా చనిపోయినవాని సంస్కారాలు చాలా భాగం కాలభైరవుడు తీసుకుపోయేలా పార్శీలు ప్రయత్నిస్తారని బాబా వివరించారు.
ఐతే, ఈ విషయంలో బాబా తన మండలి సభ్యులకు వర్తించదని బాబా స్పష్టం చేశారు.
మెహెర్‌బాబా ట్రస్టు చైర్మన్ భావూజీ కుమార్తె శ్రీమతి షీలా ఫెన్‌స్టర్ రాసిన గ్రంథం **గ్రోయింగ్ విత్ గాడ్** గ్రంథంలో పే.84లో ఈ విషయాలు ఉటంకించారు.

## పాములతో జాగ్రత్త

ఇదే గ్రంథంలో మరో ఆసక్తికర విషయం బాబా ఆమెతో చెప్పారని షీలా ప్రస్తావించింది.
అదేమంటే ఆ రోజుల్లో మెహెరాబాద్‌లో పాములు లెక్కకు మిక్కిలిగా మానవులతో సమానంగా తిరుగుతున్నాయా? అన్న చందంగా వుంది.
ఆమె కొన్ని వేల త్రాచు పాములు చూసానని ఆ రచనలో పేర్కొంది.
అంతేకాదు ఒక రోజున ఓ చెట్టు క్రింద నిల్చునుంటే ఆ చెట్టు పై నుండి ఒక త్రాచు తన తలపై పడి అక్కడి నుండి ప్రాక్కుంటూ పోయింది.
అదృష్టవశాత్తూ తనను కాటేయలేదని ఆమె అన్నారు.
ఆ తర్వాత బాబాతో జరిగిన విషయం చెబితే... పాము కాటు పడకుండా వుండేందుకు ఎప్పుడూ బూట్లు వేసుకోమని బాబా సలహా ఇచ్చారు. పాముని మానవులు చంపితే తిరిగి వాటికి పరిణామక్రమంలో మానవ జన్మ లభిస్తుందని బాబా ప్రకటించారు.
అదే మరో జంతువు బారిన పడి పాము చంపబడితే
తిరిగి పాముగానో లేదా మరో జంతు రూపమో లభిస్తుందని బాబా అన్నారు.
ఆ మాదిరిగా పాము నుండి మానవులుగా జన్మఎత్తిన వారు చాలా కోపిష్టిగా వుంటారన్నారు.
చిన్న విషయానికే చిర్రెత్తిపోయి చిందులేస్తారని
అవతారుడు తెలియజేశారు.

***

# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్‌వర్దిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా!
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.

మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,

త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోత్తముడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మవు,
పరమాత్మవు,
అల్లాహ్,
ఇలాహీ,
యజ్‌దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!
నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము.
మరియు చిట్టచివరి వరకు బాబా కొంగును దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

## జీవిత సభ్యతం

**2015 జూలై-ఆగష్టు నెలలో పంపిన వారి వివరాలు**

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | జూలై | ఎల్. మెహెర్ ప్రసాద్, విజయనగరం | రూ. 1000.00 |
| 2. | జూలై | ఇ. అరుణ, ఏలూరు, పశ్చిమ గోదావరి | రూ. 1000.00 |
| 3. | జూలై | కె. వీరాచారి, నిడదవోలు, పశ్చిమ గోదావరి | రూ. 1000.00 |
| 4. | జూలై | సురేష్ కుమార్ సోమ, హైదరాబాద్ | రూ. 1000.00 |
| | | **మొత్తం** | **రూ. 4000.00** |

**జూలై 2015 సంచికలో శ్రీమతి రమాదేవి, చోడవరం, విశాఖపట్నం బదులుగా శ్రీ ఇ.ఎన్. మూర్తి, చోడవరం అని ప్రచురించబడినది గమనించగలరు.**

# మెహెర్‌బాబా పత్రిక

మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.

**SB A/C NO: 173201000027973,**
**IFSC CODE: IOBA 0001732.**

## మా అడ్రస్:

ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్, యాప్రాల్, ప్లాట్ నెం. 32, జె.జె. నగర్ కాలనీ పోస్టు, సికింద్రాబాద్-500087.
ఫోన్: 99595-53218. **email: malladisukku@gmail.com**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D. Nirmaladevi**

RNI No. APTEL/2002/7310, Postal Concession: R&D/RNP/HSE/789/2014-2016, **Dt.06-01-2014,** Date of Publication 17th of every month